# భవన విజయం

## (శ్రీకృష్ణదేవరాయలు)

రంగస్థల నాటిక


కృతికర్త:

**డాక్టరు నందూరి రామకృష్ణమాచార్య**


కృతిపతి:

**శ్రీ ఎస్.పి.వై. రెడ్డి**

నంది పైపుల అధినేత

నంద్యాల


## ప్రకాశకులు

**నందూరి రామకృష్ణమాచార్య సాహిత్య పీఠం**

ప్లాట్ నెంబర్. 423, రాజరాజేశ్వరీ నగర్, కొండాపూర్, హైదరాబాదు - 500 084.

ఫోన్ నెంబర్ : 9440495887,9866115177

# ముమ్నుడి

నా సాహితీ జీవితం - నాటక రచనతో ప్రారంభం. అర్ధశతాబ్దికి పూర్వం నేను వ్రాసిన రంగస్థల నాటకం "ఛత్రపతి శివాజీ ". పలుసారులు ప్రదర్శింపబడినది. భీమవరం కళాశాలలో 1947లో ప్రదర్శింప బడింది. కీర్తిశేషుడు కేశవ కుర్తి వీర భద్రాచారి ప్రభృతులు అప్పటి నటులు. తదుపరి సుప్రసిద్ధ నటులు కీర్తిశేషుడు శ్రీ ఎన్.వి. ఎల్. నరసింహాచార్య ప్రభృతులు ప్రదర్శించారు. నేటి కాలంలో సంస్కార భారతివారు పలుచోట్ల ప్రచర్శించుచున్నారు.

తదుపరి నేను వ్రాసిన రంగస్థల నాటకం "ధర్మచక్రం". కృష్ణా పత్రికలో - వారం వారం అను క్రమణికగా ప్రచురితం. దానిని ఉమ్మడి మదరాసు రాష్ట్రంలో ఎన్.జి.వో. సంఘంవారు శ్రీగుమ్మలూరు సత్యనారాయణ గారి సంచాలకత్వంలో పెక్కు తావుల ప్రదర్శించారు. చెన్నపట్నం అభినేత్రి కమల గారి బృందం ప్రదర్శించారు. ఆకాశవాణిలో 1943 మదరాసు కేంద్రం వారు - ప్రచారం చేశారు.

నేను వ్రాసిన నాటిక ఉరికంబం - శ్రీ స్థానం నరసింహారావుగారి సంచాలకత్వంలో హైదరాబాదు ఆకాశవాణి వారు ప్రసారం చేశారు. నేను వ్రాసిన దశరూపకాలలోని ఏకాంకికలు పలుసారులు పలుతావుల ప్రదర్శింపబడినవి.

నా నృత్యనాటికలు "గోదావరి", "జ్యోత్స్నాభిసారిక" మున్నగునవి నరసాపురం (పురపాలకసంఘం అధినేత డాక్టరు పొన్నపల్లి సుబ్రహ్మణ్యంవారి నాయకత్వంలో ప్రచురితములు. నాటికలు "గోదావరి - వాసవీకన్యక - శ్రమ ఏవ జయతే" - ఆకాశవాణివారు ప్రసారం చేశారు.

నా బ్రదుకు మలి సంజ కెంజాయలో అనుభవంతో నేను వ్రాసిన రంగ స్థల నాటకం భువన విజయం (శ్రీ కృష్ణదేవరాయలు) శ్రీ పురుషోత్తమరావు ప్రభృతులుపలుచోట్ల ప్రదర్శించారు. ఈ మధ్య నేను వ్రాసిన ఏకాంకికలు "తిమ్మరుసు స్వగతం", "అంపశయ్య" కేవలం పద్యరూపకాలు.

తెలుగు వారికి పద్యనాటకాలపై గల మోజు అనుభవామ్రేడితం.

ఆవకాయ యనిన ఆంధ్రజాతికి ప్రీతి పిండి వంట లెన్ని యుండుగాక కలదు

పద్యమనిన తెలుగువారికి ప్రీతి రక్తి కట్టు రమ్య రచనలున్న.

'తెలుగులో ఉత్తమ నటులు ఎందరో ఉన్నారు. ఉత్తమోత్తమనాటకం ఒకటి లేదు. అన్నాడొక సుప్రసిద్ధ సాహిత్య సమాలోచకుడు. అట్టి ఆదర్శనాటకం అద్యతన భవిష్యత్ కాలంలో అవతరించుగాక.

సంగమం.

నాటకం-విజ్ఞాన దాయకమూ వినోద విద్యాదాయకం అది ఒక త్రివేణీ

విజ్ఞాన విలాసం - వినోదవిన్యాసం - నటనాచాతుర్యం ఒకచోట నమరాలి. విపుణ రచన - విపుణ నటన గంగా యమునల వలె సంగమించాలి.

**సింహావలోకనము**

ఈ నాటక కృతిపతి ఎస్. పి. వై. రెడ్డిగారు. ఎందుకు శ్రీ ఎస్. పి. వై. రెడ్డి గారికి ఈ నాటకం అంకితం చేయబడినది ??

శ్రీ ఎస్. పి. వై. రెడ్డి గారు ఎన్నో కావ్యాలు అచ్చువేసి ఇచ్చిన కృతిభర్త. మాత్రమే గాక ఉదార దాతగా దానధర్మపరాయణడుగా దానకర్ణుడుగా సుగ్రృహీత నామధేయుడు. అంతేగాక "అభినవ కృష్ణదేవరాయ" బిరుదాంకుడు. శ్రీ కృష్ణదేవరాయల నాటకం = భువన విజయం అంకితం పొందుతే, శ్రీవారు సార్థక బిరుదాంకులు అనిపించుకుంటారు. ఈ నాటకం అంకితం తీసుకోవటానికి శ్రీ ఎస్.పి.వై. రెడ్డిగారు అంగీకరించటం కృతి కర్త - కృతిభర్తుకు ఉభయతారకం.

ఈ నాటక కృతికి సరియైన కృతి భర్త దొరికినాడు. కృతిభర్త - సార్థక బిరుదాంకితుడయ్యారు. నాకు రాయలసీమ అంటే ప్రగాఢానురాగం ఉన్నది. నిదర్శనం నేను వ్రాసిన పద్యం - రాయలసీమసభలలో - దేశవిదేశాలలో తెలుగునేల నాలుగు చెరగుల ప్రతిధ్వనించుచుంది.

క్షామము దాపురించి పలుసారులు చచ్చెను జంతుసతతుల్
వేపురు చచ్చినారు ప్రజ వేలకు వేలు చరిత్ర చాటునన్
క్షామము లెన్ని వచ్చిన - "రసజ్ఞత" ఇంచుక చావలేదు జ్ఞా
నామృత వృష్టికిన్ కొరతనందని రాయలసీమలోపలన్.

రాయలసీమలో సగటు సహృదయునిలో కూడ అష్టదిగ్గజ కవితా సింహాసనములతో విరాజిల్లే "భువన విజయం" అదృశ్యంగా గూడు కట్టుకొని ఉంటుంది. నేటికీ రాయల సీమ నేల నాలుగు చెరగులలో

సహృదయులు సాహితీ రసికులు కోకొల్లలుగా గోచరిస్తారు. రాయలసీమ లలిత కళలకు భోగభూమి.

రాయల సీమ రాసిక్యం మూర్తీభవించిన జంగమజీవన రక్తమాంసల చర్మ విగ్రహం. శ్రీ ఎస్. పి. వై. రెడ్డిగారు.

శ్రీ రెడ్డి గారికి చెన్నపురి తెలుగు సమాఖ్యవారు విశిష్ట దాతగా సముచిత పురస్కారం లభించినది. నాకు లోగడ పలుసారులు - తెలుగు పద్యశిల్ప కృతిపతిగా, రసజ్ఞ సార్వభౌముడుగ సాయం చేసియున్నారు. వారికి నేను శాశ్వత ఋణగ్రస్తుడను. ఈ శాశ్వత ఋణం కొంత కొంత తీర్చుకోవాలనే తహతహతో నాటిన - : శ్రీకృష్ణదేవరాయలు = భువనవిజయం ఎస్. పి. వై. రెడ్డిగారికి అంకితం చేయు చున్నాను.

సూరన సాహితీ సంఘం వారు గెలివి సహదేవుడు శ్రీ సుబ్రహ్మణ శాస్త్రి, శ్రీ శేష ఫణిశర్మ ప్రభృతులు రెండు సారులు నాకు నంద్యాలలో సన్మానం చేసియున్నారు. ఈ సందర్భంలో నా అభిమాన రచయిత శ్రీ యామినీ సరస్వతి పేరు ఉదాహరించుట నా కర్తవ్యం. అతనిలో "క్రొత్త పాతల మేలి కలయిక" తరచు నాకు సాక్షాత్కరించింది. అతనికి నా పైగల దివ్య భక్తికి అనురక్తికి నా ధన్యవాదాలు.శ్రీ కృష్ణదేవరాయల భువన విజయము ఆడి వినిపించిన సంస్కార భారతికి - నట వర్ణముగు నా ఆశీరభినందనము.

ఒకసారి - భువనవిజయం - పశ్చిమ గోదావరి నరసాపురిలో - డా. పొన్నపల్లి సుబ్రహ్మణ్యంగారు నిర్వ హించారు. ఆచార్య దివాకర్ల అవధాని- దాశరథి కృష్ణమాచార్య - డాక్టరు వి.వి.యల్ నరసింహారావు - జంధ్యాల పాపయ్య శాస్త్రి ప్రభృతులు భూమికలు ధరించారు.

## అంకితం

**సుజల - నంది పైపుల పరిశ్రమాధినేత**

**యస్.పి.వై.రెడ్డి = శ్రీ సన్నపురెడ్డి పెద ఎరుకల రెడ్డి B.E. గారికి**

అగ్రగణ్య పౌరుడవు నంద్యాలలోన
నేతలందున ఈ నాటి దాతలందు
చెన్నపురిని సత్కారమ్ము చేసినారు
నిన్ను దానకర్ణుడవంచు సన్నుతించి.

మెచ్చి నీకు కృతిని ఇచ్చుచున్నానుగా
స్వీకరింపవయ్య వేడ్క మీద,
ఆంధ్రవాఙ్మయము నందు నీ నామమ్ము
స్థిరయశస్సుతోడ చెన్ను మీరు.

దాన ధర్మశీలి - ధనిక మేధావియైన
ధన్య జీవి - సకల ధరణి మీద;
లాస్య మాడు గాత - లక్ష్మి సరస్వతుల్,
నంది పైపుల దొర అంద మందు.

కవి జహాపనుండు - కలుగోట్ల విజయుండు
గనిని బ్రతికి వ్రాయ గలిగె - కృతులు;
అమర సీమ నున్న - ఆత్రేయ కవి ఆత్మ,
పుడమి నున్న " రెడ్డి" బ్రోచు గాత.

నాయకోత్తముండు - నంద్యాల గడ్డపై

రెడ్డి వరుడు - వేల్పు గిడ్డి - ప్రజకు;

గుండెలోన - కట్టుకొనెను - వెన్నెల గుడుల్

కవిత కొరకు - లలిత కళల కొరకు.

మల్లెపుప్పొడి జల్లు - పిల్ల గాలుల అలల్

జవ్వాజి కస్తూరి సంభ్రమములు !

జగదేక సుకుమారి - జడలోని సంపెగల్ !

నెఱజాణ విసరు - పన్నీటి జల్లు !

నందన వని నవ్వు మందార మంజరుల్ !

చదలేటి అపరంజి జలరుహములు!

చలువ రాగుడిలోని సాంబ్రాణి ధూపముల్ !

జవరాలి తొలి రేయి చందనములు !

వగల వలపు గొలుపు మొగలాయి అత్తరుల్ !

కుంకుమాగరు పునుగు గుమగుమలు !

సరస కవిత మెచ్చు - సహృదయామోదమ్ము

సాటి గావు - రసిక జగతి యందు.

నీ నగు మోములో వెలుగు నిత్య వసంత మనోజ్ఞ నందనో

ద్యానము - నీ వచస్సుల మృదంగ సహస్రము, దేవదుందుభుల్

వీణలు, వేణు నాదములు విన్పడు - నీదు పరోపకార పా

రీణత గాంచినన్ - పులకరించును గాత - రసప్రపంచముల్.

ఎవ్వాని లీవిలో - విన్వాళు లెత్తును

ఆజానుబాహువౌ రాజసమ్ము !

ఎవ్వాని ఈవిలో - నివ్వటిల్లును కర్ణు

కవచ కుండల దివ్య కాంతి రేఖ !

ఎవ్వాని కనులలో - నవ్వుచుండును సదా

సచ్చిదానందసౌజన్య దీప్తి ! -

ఎవ్వాని పనులలో - పవ్వళించును పరో

పకృతి పారీణతా పరిమళములు!

అమృత హృదయు డతడు - ఆదర్శ పౌరుండు;

నంది పైపుల అధినాయకుండు;

రెడ్డి రేడు - వేల్పుగిడ్డి; నంద్యాలలో;

మేటి దాత లందు మేరు శిఖరి.

మనుమసిద్ధి రాజు మామా యనుచు పిల్చి

మాన్యు తిక్కన కవి మంత్రి జేసె;

నన్ను సత్కరించి - నంద్యాల శ్రీ రెడ్డి

మామ యనుచు పిలిచి మాన్యు చేసె

పది మరియు పది వేలిచ్చె పద్యసభకు

నంది పైపుల నేత - నంద్యాల రెడ్డి

అపర కృష్ణ రాయ బిరుదు డమృత హృదుడు

దాన కర్ణుండు - నవ్యాంధ్ర ధరణియందు.

వినయము విద్యయు కలిసిన
మనుజుని హృదయమున - దివ్య మాధురి విరియున్;
ధనమును దానము కలిసిన
మనుజుడు - మహికి - మకుటాయ మానుడు సుమతీ.

సర్వ మంగళ " స్వాతి " సతిగ కొలువ
సుజల 'అరవింద రాణి ' దిగ్విజయ లతలు
సుతలు - నాశా వియత్తలి శోభిలంగ
వెలుగు నెరుకల రెడ్డి - మంగళ మహోస్తు.

నంది పైపుల దొర - రసానంద మధుర
మృదుల మందార చారు పరీమళాత్త
లలిత కలధౌత కీర్తి విరాజమాన
వీర శృంగార సాహిత్య విజయ సోమ.
అభినవ కృష్ణరాయ బిరుదమ్మది కమ్మగ ఘుమ్మనన్ యశో
విభవ తరంగ డోలికల - వేమరు, తూగిన ఆంధ్ర సాహితీ
ప్రభ, వినువీధి కెత్తబడి రంగుల హంగు కురంగలించె - సౌ
రభములు చిమ్మి - నవ్య రస రాజ్య రమా హృదయాంగణమ్మునన్.

'తెలుగు పద్య శిల్ప' కవితా విలసనములు
తెలుగు పద్య శిల్ప మహత్ కల రవములు
తెలుగు పద్య శిల్ప కళావతీ రుతముల
తెలుగు పద్య శిల్ప నవతా ప్రదీప్త శిఖలు

శారదా కచ్ఛపి శుభ స్పందనమున

కళలు చిలికించి హోయలంత నాలుక బోసి

మిమ్ము పరవశమ్మున ముంచి మిసిమి మీరి

కమ్మ దనములు జగతిపై జిమ్ము గాక !

విరుల పరిమళాల రస వీచుల రోచులు - మీ సుగంధ సుం

దర మకరంద బంధుర సుధా హిమచందన వాగ్విభూతి మం

జరులు, నిమ్ము, కొమ్ము - సరసాంధ్ర కవిత్వ సుశిల్ప రాజ్ఞి - నో

ఎరుకల రెడ్డి రాణ్మణి - జయీ భవ - మీ విమల ప్రశస్తికిన్.

పెద్ద ఎరుకల రెడ్డి గంభీరతలును

సిరుల ఝురులును కీర్తిపందిరుల పొగపు

త్యాగ విస్తార భోగ నిస్తంద్ర రుచులు

ఆయు రైశ్వర్య రాగ సౌఖ్యములు చెలగి

పరిధవిలు గాక కకుబంత పరిధి దాక

ఆ మహోదారు హృదయ సౌహార్దతలకు

అంజలి ఘటించు గాక నవ్యాంధ్ర జగతి;

ఆ మహాదాత యౌదార్య హైమ శిఖర

ముఖరిత మగుత కవితా ప్రమోద భేరి.

నంది మండల శ్రీ మహానంది శివుడు.

త్రిపురసుందరి - కరుణా మరీచి వీచి;

రెడ్డిగారి కుటుంబమ్ము, రెడ్డిగారి,

నాంతరంగికులను, బ్రోతు రభయ ముద్ర.

రాజిత శైలరాజ శిఖరాంచల చంచల హేమ రత్న వి

భ్రాజిత వేదికోపరి విలాస విలక్షణ లాస్యరక్తి నీ

రాజిత పాద పంకజ విరాజిత శాంకరి రెడ్డి రాట్సము

త్తేజము బ్రోచుగాక - నలుదిక్కుల భేరులు మారుమ్రోయగన్.

తరల మురళీ స్వరాళి సంధ్యా సరాగ

ముగ్ధ బృందావనీ కళా స్నిగ్ధ మధుర

లలిత సికతా విహార విరాజ మాన

చారు శృంగార రాధా సుధాధరమ్ము

గ్రోలు - నెమలీక లయ్యె, తా బ్రోచు గాక.

# భువన విజయం

## ప్రథమాంకము

**శ్రీకృష్ణదేవరాయ కొలువు కూటము " ముత్యాల శాల"**

**(తిమ్మరుసు, పెద్దన, విశ్వనాథ నాయకుడు, నాగమనీదు సభలో ఉండగా రాయ ప్రవేశం)**

**వంధి మాగధులు :- జయ జయ స్వస్తి శ్రీ మహారాజ రాజశ్రీ రాజపరమేశ్వర రాజ మార్తాండ - మూరు రాయరగండ - పరగండ భైరవ సాహితీ సమరాంగణ సార్వభౌమా బహుపరాక్ -**

**స్థలదుర్గ జలదుర్గ గిరిదుర్గ చతురశీతి దుర్గ సమస్తదళ విభాళా - బహుపరాక్ - హత్తిబ్బర గండ, జగనొబ్బర గండ, మహా దబ్బర గండ, కర్ణాటకబుధ ధన్యాసిక - ఉమ్మత్తూరు, శివ సముద్ర పుర ప్రోన్మూలన క్రీడాపరాయణా - బహుపరాక్ - రాయచూరు చూరాకారా - శ్రీ కృష్ణదేవరాయ సార్వభౌమా ! బహుపరాక్.**

**తిమ్మరుసు :- జయం జయం, మహారాజులకు.**

**శ్రీకృష్ణ :- అప్పాజీకి అభివాదములు**

**పెద్దన :- జయం, జయం సాహితీ సమరాంగణ సార్వభౌములకు**

**“గంగా స్వచ్ఛతరంగభంగికయశో గాఢ చ్ఛ విచ్ఛన్న సా**

**రంగోంగాంక నిరంకుశ ప్రతికళా ప్రౌఢి ప్రియంభావుకా**

**గాంగేయాచల చాప నూపుర వచో గాంభీర్య లీలాస్పదా !**

**బంగాళాంగ కళింగ వంగ సుభటాభ్ర శ్రేణిఝంఝూనిలా”.**

**శ్రీ కృష్ణ :- ఆంధ్ర కవితా పితామహులకు అభివాదాలు.**

**పెద్దన :- రాయచూరు విజేతకు విద్యానగర సామ్రాజ్యలక్ష్మి - పులకాంకుర ప్రకరాలల్వ కర్పూర నీరాజనం సమర్పించుచున్నది.**

**తిమ్మరుసు :- విద్యానగర సామ్రాజ్యానికి ఈనాడు విజయోత్సవం ఈనాటి విజయోత్సవాన్ని ప్రభువులు వీరాభి షేక, మహోత్సవంగా ప్రకటించడమే గాక రాయచూరు వీరులకూ సన్మానం జరుపడానికి**

నిశ్చయించారని తెలియజేయడానికి సంతోషించుచున్నాను.

నాగమ :- రాయచూరు ముద్దల్లు తిరిగి మన వశం కావడం అసాధ్యమని పలువురు భావించారు.

తిమ్మరుసు :- శ్రీకృష్ణ దేవరాయలవారి నిఘంటువులో " అసాధ్యం " అనే శబ్దానికి

చోటు లేదని తెలియనివారు అలా భావించియుంటారు.

పెద్దన :- శ్రీశ్రీ సాళువ నరసింహరాయలవారు మరణశయ్యపై నుండి శ్రీకృష్ణ

లిరాయల వారి తండ్రి శ్రీ ఈశ్వర నారసింహరాయల వారిని ఆనాడు కోరిన కోరిక, కుమారుడు, మన రాయలవారు ఈ నాడు నెరవేర్చినారు. విజయనగర వీరుల కల నేటికి

"కలరూపు" ధరించి.

విశ్వనాథ :- రాయచూరు గడ్డ దక్షిణాపథంలో అపర కురుక్షేత్రం. తుంగభద్ర నీరు త్రాగిన ఒక్కొక్కడు కవోష్ణ రక్తం పొంగి పొరలే ఒక్కొక్క మహావీరుడౌతాడనడంలో సందేహం లేదు.

పెద్దన :- 'గంగా స్నానం, తుంగా పానం" అని అననే అన్నారు గదా.

నాగమ :- రాయచూరు అంతర్వేదిని జయించి వైరివీరుల రక్త తర్పణంతో ప్రాచీన విజయనగర సార్వభౌముల ఆత్మలకు శాంతి సమకూర్చిన శ్రీకృష్ణ దేవరాయల వారికి అభినందనములు.

తిమ్మరుసు :- ఈ సందర్భంలో మీకూ, మీ ద్వారా విద్యానగర పౌరులందరకూ రాయచూరు విజయ సాధనకు కీలక మనదగిన ఒక గుప్త సమాచారాన్ని విశదం చేయడం నా విధ్యుక్త ధర్మంగా భావిస్తున్నాను.

పెద్దన :- ఈ విజయ రహస్యం వినాలని విద్యానగర పౌరులు దోర చెవులతో కాచుకొని యున్నారు.

తిమ్మరుసు :- ప్రభువులు మన్నించాలి - రాయచూరు ముట్టడిలో ఒకానొక క్లిష్టమైన సందర్భంలో మన సేనలు తిరోముఖం పట్టవలసిన పరిస్థితి ఏర్పడింది. తాత్కాలికంగా నైనా వెనుకంజవేస్తే మంచిదని రాయల వారికి నేను కూడా సూచించడం జరిగింది. పెద్దన : మరి.............................

తిమ్మరుసు :- " యశో వా మృత్యు ర్వా " అన్నారు రాయలవారు " పదండి ముందుకు ' అని గర్జిస్తూ ఏకాంగిదళాన్ని పురి కొల్పారు. " నాకు యశస్సూ వద్దు - మృత్యువూ వద్దు - వెనుక నిలుస్తానన్నాను - నేను

పెద్దన :- నమ్మలేకుండా ఉన్నాను. మహామంత్రి యుద్ధంలో పాల్గొనక పోవడమా?

రాయలు :- చూచారా అప్పాజీ ! పెద్దన్నగారూ ! అప్పాజీగారింతకు ముందు చెప్పిన

"కీలకం" అదే. వారెలా యుద్ధంలో పాల్గొన్నారో నేను చెప్తాను వినండి. ఉగ్ర నారసింహావతారం దాల్చి వెనుక నిలబడి పిరికి వాళ్లకు కూడా ధైర్యం నూరిపోసి, తిరోముఖం పట్టదలచినవాళ్లను తనకత్తికి బలి యిచ్చి తుంగ భద్రకు అర్పిస్తానని ప్రళయ గర్జన చేసి యావత్తు సైన్యాన్ని పురోగమించేట్లు చేశారు.

పెద్దన :- ఆశ్చర్యం ! అద్భుతం.

రాయలు :- ముట్టడిలో ప్రతివీరుడూ ప్రాణాలొడ్డి పోరాడినాడు. ఈ విజయం వీరు లందరిదీ అందుకే యీనాటి ఉత్సవాన్ని వీరాభిషేక మహోత్సవగా ప్రకటించాం. వీరస్వర్గం అలంకిరించిన వీరులందరకీ మన జేజేలు. వారి కుటుంబాలకు జాగీరులు. వియజ వీరులందరకూ ఈ ముత్యాల శాలలో వీరాభిషేక : సన్మానం.

తిమ్మరుసు :- మహాప్రసాదం.

రాయలు: - ఇక రాయచూరు విజేతృనాయకమణి నాగమ నీడుకు వీరాభిషేక మర్యాద లతో పాటు గండపెండేరం కూడా బహూకరింపదలచినాము.

తిమ్మరుసు :- నాగమనాయుడు అదృష్టవంతుడు. ఈ మహావీరుని శౌర్యపరాక్రమాలను వర్ణించుటకు నాకు శక్తి చాలదు.

రాయలు :- మన కవితాపితామహులున్నారు గదా.

పెద్దన :- స్వయంగా విని ప్రతిస్పందన కాదగిన ఉత్సాహం వెల్లువగా ప్రవహిస్తోంది

ఇతడే నాగమనీడు, సాహస కళా హేలార్భటిన్ మృత్యు దే
వత ముక్కున్ తనముష్టఘాతమున నొవ్వం జేసె రాచూరులో
ఇతడే రాయలవారితో సమముగా నేగెన్ పురోగామియై !
ఇతడే యెత్తిన కత్తి దింప దనిలో నేకాంగి వీరుండుగన్,

నాగమ :- రాయచూరు ముట్టడిలో ఆసన్న మౌతున్న అపజయాన్ని ఘనవిజయంగా మార్చిన అద్భుత శక్తి రాయలవారిది ఈ. వారికి వారు సన్మానం చేసుకోవడం ఇష్టంలేక - మాకు చేస్తున్నారు.

రాయలు :- మహావీరుడు నాగమనీడు మా కుడి భుజం. ముందుకు నడిచిన విజయనగర సైన్యంలో

మునుముందు నిలిచిన మొనగాడు.

నాగమ :- ప్రభువులు మన్నించాలి - నేను మొదట లేను తమ వెనుకనే ఉన్నాను. నా గుఱ్ఱం రాయల వారి గుఱ్ఱాన్ని అతిక్రమించి ఎప్పుడూ పోలేదు.

రాయలు :- నిజానికి మన ఉభయుల గుఱ్ఱాలకు ముందు ఉరికిన గుఱ్ఱం నీ కుమారుడు చిరంజీవి విశ్వనాథునిది. విశ్వనాథుడు తండ్రికి మించిన వీరుడు కాగలడు.

విశ్వనాథ :- మీ ఆశీర్వచనమునకు కృతజ్ఞుడను కాని అది యంతయు ప్రభువుల నుండి పొందిన స్ఫూర్తియే గాని వేరు కాదు. తాము స్వయంగా వెన్ను తట్టి నిలబడితే ముందు కుఱకడం ఒక లెక్కలోనిదా ? ప్రభూ ?

రాయలు :- మహావీరుడు నాగమనీడుకు గండ పండెర ప్రదాన సన్మానం చాలదు. నాగమనీడు కోరిక వరం ప్రసాదించవలెనని మా అభిమతం.

తిమ్మరుసు : -ప్రభువు ఔదార్యం ఉగ్గడింపదగినది. నాగమ నాయకా వరం, కోరుకో. నాగమ :- ప్రభూ, పిరికి వాళ్లను కూడా అతివీరభయంకరులైన మహావీరులుగా మార్చే పరుసవేది తమ చేతిలో ఉంది. తరాలుగా కరువైన శాంతి సౌఖ్యాలు విజయనగర సామ్రాజ్యనికి ఈ నాటికి లభించాయి. ఇదే గొప్ప సన్మానం ఇది చాలు

ప్రభూ - సర్వే జనాః సుఖినో భవంతు - ఇదే నా కోరిక.

తిమ్మరుసు :- భళా ! నాగమ నాయకా ! కాని "వీర పూజ" ప్రజలలో తరచు వ్యాపించే నిర్వీర్యతావ్యాధికి మందు లాంటిది. వీరుడు సంతోషిస్తే ఆ ఉత్సాహం ప్రజలందరూ పంచుకుంటారు. కనుక నీవు వరం కోరుకోవాలి.

నాగమ :- సరే కోరుకుంటాను. ప్రభువులు అనుగ్రహించి మా చిరంజీవి విశ్వనాథుని తమ తాంబూల కరండ వాహకునిగా గ్రహించి సదా తమ సన్నిధానవర్తిగా మసలుకునే అవకాశాన్ని కలిగించాలని నా కోరిక.

రాయలు :- సంతోషం ! ఏమి విశ్వనాథా ! నీకు సమ్మతమేనా ?

విశ్వనాథ :- ప్రభూ, కల్పవృక్షాన్ని కాపలా కాస్తావా అని అడిగితే కాదనే అవివేకి ఎక్కడైనా ఉంటాడా ? తమ అనుగ్రహం గొప్పదో నా అదృష్టం గొప్పదో తేల్చుకోలేని పరిస్థితి ఏర్పడింది నాకు.

నాగమ :-రాయచూరు విజయం రాబోయే విజయ పరంపరలకు మొదటి సోపానం మాత్రమే నని నా

అభిప్రాయం అశ్వపతుల్ని జయించిన రాయల వారికి గజపతు లొకలెక్క కాదు.

తిమ్మరుసు :- ప్రభువుల కొక మనవి. ప్రభువులు ఉమ్మత్తూరును శివసముద్రా జయించి నప్పటినుండి దక్షిణం అంతా లొంగిపోయినట్లే. కన్యాకుమారి వరకూ రాయలవారి ఆజ్ఞ చెల్లుచున్నది. కాని ..........

రాయలు :- అర్ధోక్తిలో ఆగిపోయారేం అప్పాజీ !

తిమ్మరుసు :- పాండ్యచోళాధీశ్వరులు పరస్పర కలహాలకు లోనగుచున్నారు.

ఓడిపోయిన పాండ్యరాజు తమను శరణుజొచ్చుచు రాయబారిని పంపియున్నాడు. రాయలు :-రాయబారిని ప్రవేశ పెట్టమనండి.

తిమ్మరుసు :- ఎవరక్కడ! పాండ్యదేశపు రాయబారిని ప్రవేశ పెట్టండి.

రాయబారి :- జయం! జయం! సార్వభౌములకు,

రాయలు :- పాండ్యరాయబారికి స్వాగతం - ఆశీనులుకండి ---------

మీ సందేశం వినిపించవచ్చు.

రాయబారి :- ఏ చక్రవర్తి బొమ్మముడి పాటు గాంచినంతనే దక్షిణాపథం అంతా దద్దరిల్లి పోతుందో, ఏ మహావీరుని కరవాల దీధితుల తర తరాల చరిత్రకు మొగు మాయని మిరుమిట్లు కల్పించునో; ఏ సాహితీ సమరాంగణ సార్వభౌముని సహృదయత దేశభాషలకు స్వర్ణయుగం సంతరింపజేసినదో, ఏ రసజ్ఞ సమ్రాట్టు తేజోమయ నేత్రద్వయ సమాదర కటాక్షవీక్షణాలు మహాకవుల ఘంటాలు బంగారు కలలు కనునట్లు; చేయుచున్నవో ఆ రాజపరమేశ్వర, మూరు రాయరగండ శ్రీ కృష్ణదేవరాయల వారిని, న్యాయభిక్ష కోరుచూ, మా పాండ్య రాజచంద్రుడు శరణు జొచ్చినాడు. మా ప్రభువును చోళులు రాజ్యభ్రష్టు నొనరించినారు.

రాయలు : - ఆ కథావిధానమంతయూ మా కవగతమే - చోళదేశాధిపతి పాండ్యరాజ్యం ఆక్రమించడం అన్యాయమే.

రాయబారి :- ధర్మప్రభువులు, సార్వభౌములు సహృదయతవల్ల మా పాండ్యరాజుల వారికి న్యాయం లభిస్తుందని, పైతృక రాజ్యం సిద్ధిస్తుందని నమ్ముచున్నాము. రాయలు :- మా పరిపాలనలో దుష్టశిక్షణ, శిష్టరక్షణ, అవశ్యం జరుగవలసిందే. ఈ కార్యభారం సమర్ధవంతంగా నిర్వహించడానికి మహావీరుడు

నాగమనాయకుని నియమిస్తున్నాం.

నాగమ :- మహాప్రసాదం.

రాయలు :- నాగమనాయకా! ఇదిగో కర్పూర తాంబూలం నీవు కోరిన భటులను తీసుకొని శుభ ముహూర్తం చూచి బయలుదేరు. జయోస్తు.

అప్పాజీ ! పాండ్యరాయబారిని జాంబూనదాభరణాదులతో సత్కరించండి.

పాండ్య రాయబారికి సెలవు. (రాయబారి నిష్క్రమణం).

నాగమ :- ప్రభూ ! తమ అనుగ్రహంతో అతిశీఘ్రంగా ఈ కార్యం నిర్వర్తించి మరలివస్తాను. తరువాత.

రాయలు :- పూర్వ దిగ్విజయ యాత్రకు ఉపక్రమించాలని మా ఉద్దేశ్యం

నాగమ :- నా అభిప్రాయాన్ని ఆ విధంగా విప్పి చెప్పలేక పోయినందుకు ప్రభువులు మన్నించాలి.

రాయలు :- నాగమనీడూ ! ఇది మన అభిప్రాయమే కాక, ఈ విజయనగర పౌరులందరిదీ కూడా ! ఈ సందర్భంలో అప్పాజీ మీ కొక విచిత్ర వృత్తాంతము చెబుతారు.

అప్పాజీ - మొన్నరాత్రి మనం మారువేషంతో నగర సంచారం చేస్తున్నప్పుడు .....

తిమ్మరుసు :- ప్రభువుల అనుగ్రహం ఆ చాకలి రంగశాయి పైన ఆ రాత్రి నుంచీ క్రమాభివృద్ధి చెందుతూనే ఉంది. ఒక సాధారణ పౌరుడూ ప్రభు భక్తి పరాయుణుడు అయిన ఆ చాకలి రంగశాయి ఆ రాత్రి వీరివేశంతో పాడుతున్న పాట ప్రభువుల్ని ఎంతగానో ఆనందపరిచింది.

రాయలు :- అవును పూర్వదిగ్విజయ యాత్ర ఆరంభించాలనే కొండవీడు కొండపల్లి దుర్గాలను జయించాలనే ఊహతో ఉన్న మాకు ఉత్సాహం ఉరకలు వేస్తూ పాట పాడే ఆ చాకలి రంగశాయిని చూచాక మా ఊహల్ని వీలైనంత త్వరలో కార్యరూపంలో పెట్టాలనే సంకల్పం ఏర్పడింది.

నాగమ :- చోళుల పై దండయాత్ర శీఘ్రంగా ముగించుకొని పూర్వదిగ్విజయ యాత్రలో ప్రభువులను కలుసుకోవాలని ఉవ్విళ్లూరుచున్నాను. శుభముహూర్తం మీరే నిర్ణయించండి ప్రభూ.

రాయలు :- మాకు ఈ సంకల్పం ఏర్పడడానికి, తన వంతు తాను సహకరించిన ఆ చాకలి రంగశాయిని తగు విధంగా సత్కరించి - శుభ ముహూర్తం నిర్ణయించడం బాగుంటుందనుకుంటున్నాను - అప్పాజీ - రంగశాయికి మా దర్శనం కల్పించే ఏర్పాటు చేశారా ?

తిమ్మరుసు :- తమ ఆజ్ఞ అన్యథా జరుగుతుందా ! రంగశాయి ప్రభు దర్శనార్థం వేచియున్నాడు - ఎవరక్కడ ? - చాకలి రంగశాయిని ప్రవేశ పెట్టండి.

రంగశాయి :- (ప్రవేసించి) ప్రభువులోరు - సల్లగుండాలి.

రాయలు :- రంగశాయీ నిన్నెందులకు పిలిపించామో తెలుసుగా, నీవు మొన్న రాత్రి పాడిన పాట ఎంతకూ మరపు రావడం లేదు. ఏదీ ఒక్కసారి వీరందరి ముందూ ఆ పాట పాడి వినిపించు.

రంగశాయి :- దేవరా ! అందరు అనుకునే మాటలే నా నోటి నుండి పాటగా జారింది. అంతే దేవరా.

తిమ్మరుసు :- శాయీ, పాడరా, నీ పాట విని ప్రభువులు చాలా ఆనందించారు. రంగశాయి :- చిత్తం దొరా !

విజయ భేరి మోగించర వీరుడా - జయ పతాక నెగరవేయ్యరా
కొందవీడు మనదేరా - కొండపల్లి మనదేరా
కాదని వాదుకు వస్తే - కత్తి దూసి జవాబివ్వు ||విజయ||
కృష్ణానది మనదేరా - గోదావరి మనదేరా
కోనసీమ మనదేరా - కోరుకొండ మనదేరా
కాదూ కూడదు అంటే - కటకం దాక మనదేరా ||విజయ||

నాగమ :- శెభాష్ రంగశాయీ ! ప్రభూ పూర్వ దిగ్విజయాత్రకై ప్రజలందరూ ఉత్సాహపడుతున్నారని మీరన్న మాట అక్షరసత్యం.

తిమ్మరుసు :- కొండవీడు, కొండపల్లి సంగతి తర్వాతమాట, మన ఉదయగిరి ఇంకా గజపతి చేతుల్లోనే ఉంది.

రంగశాయి :- " ఉఫ్ఫ్ మనీ ఊదితే - ఉదయగిరీ మనదేరా
మనదేరా మనదేరా – మనదేరా మనదేరా || విజయ||

రాయలు :- రంగశాయీ, నీకెంత రాజ్యభక్తిరా. నిన్ను మెచ్చుకున్నాం. నీకేం వరం కావాలో కోరుకో.

రంగశాయి :- అయ్యబాబోయ్ వరమే ! ఏంకోరుకునేది దేవరా - నాకంతా తికమకగా ఉంది. నా బుఱ్ఱకేమి తోచడం లేదు.

తిమ్మరుసు :- రంగశాయీ, వెండి బంగారాలో, ధన ధాన్యాలో భూములూ భవనాలో నీకేం కావాలంటే అవి

నీ యిష్టం వచ్చినట్టు కోరుకో.

రంగశాయి :- 'అబ్బే! అయ్యన్నీ నేనేం జేసుకుంటాను. వాటిని కాసుకోలేక సావాలి దేవరా ! పెబువులు మన్నిస్తే రాయలోరికి యింజామర ఈస్తూ ఎప్పుడూ ఆరెంటనే ఉండి ఊడిగం జేసుకోవాలని నా కోరిక.

రాయలు :- రంగశాయీ ! నీకోరికను మన్నిస్తున్నాము.

అప్పాజీ :- యితనికి కొలువు పత్రం జాగీరు ఏర్పాట్లు చేయించండి. రంగశాయి :- ధర్మప్రభువులు కలకాలం చల్లగుండాలి (నిష్క్రమణ)

రాయలు :- పూర్వ దిగ్విజయాత్రకు నాందిగా ఉదయగిరి ముట్టడికి ఉపక్రమించాలి నిర్ణయిస్తున్నాము. అప్పాజీ సన్నాహాలు చేయించండి.

అందరూ :- శ్రీకృష్ణరాయల వారికీ “జై ” !

## ద్వితీయాంకం - ఉదయగిరి దుర్గం

(రంగశాయి - ప్రవేశం)

కొండపల్లి మాదేరా - కొండవీడు మాదేరా

కృష్ణానది మాదేరా - గోదావరి మాదేరా,

కోనసీమ మాదేరా - కోరుకొంద మాదేరా

కాదని వాదుకు వస్తే - కటకం దాక మాదేరా ||విజయ||

- తెనాలి రామలింగం - ప్రవేశం -

రామలింగ :- ఎవరయ్యా నువ్వు ? నీది గుండా - చెరువా ? ఈ ప్రాకారం మీద నిలబడి, ఏమిటీ వీరంగం ?

రంగశాయి :- నా సంగతి కేమొచ్చె గాని - నీవెవరు నాయనా - ఎక్కడి నుండి ఊడిపడ్డావ్ ?

రామలింగ :- మాది తెనాలి కొండవీడు సీమ, కొండవీడు పేరు వినబడేసరికి ప్రాణాలు లేచివచ్చాయి.

రంగశాయి :- అట్లా జెప్పు. నుదిటి నిండా అంత బూడిద పట్టించిన ఆ మొగం చూస్తే తెలుస్తూనే ఉందిలే, మీ శ్రీనాథుడే మన్నాడో తెలుసా "ఆవగింజంత బూదిమై నలుము కొన్న ఎలమి గుమ్మడి కాయంత ఎర్రి బుట్టు" అన్నాడు. నిన్ను జూస్తా ఉంటే ఆయన గుర్తుకొస్తా ఉన్నాడు. నా సామి రంగ అదే మా ఊళ్లో అయితేనా !

రామలింగ: - మీ ఊళ్లో అయితే .

రంగశాయి :- మా ఊళ్లో అయితే ఎక్కడ జూసిన సక్కగా శ్రీ చూర్ణం తిరుమణిక్కాపు - కల కల కిల కిల తిరుగుతుంటాయి. సాములు శ్రీ వైష్ణవులు.

రామలింగం :- చెప్పావు. గనుక సరిపోయింది అందుకనా బాబూ నీ ముఖం నిండా అంత తిరుమణిక్కాపు - నిన్ను చూడగానే ఏ తొండరడిప్పొడరి అళ్వారో అనుకున్నా ఇంతకీ - మీదే వూరు ?

రంగశాయి :- చెబుతాలే ! నీ ఊరు జెప్పావు గానీ పేరు జెప్పలేదు. నీ పేరేమిటంట ? రామలింగ :- నేను కవిని. నన్ను- తెనాలి రామలింగం అంటారు.

రంగశాయి :- ఆరి నీ తస్స దియ్య నువ్వు కవివా? నమ్మమంటావా ?

రామలింగ :- నీ సందేహానికి కారణం ఏమిటి ?

రంగశాయి :- నీ వయసూ వాలకం జూస్తా ఉంటే ఇంత తక్కువ వయసులో ఉన్న నిన్ను కవీశ్వరుడని ఎట్లా ఒప్పుకోవాలా నాసామి రంగ అని సందేహిస్తున్నా. అట్టా అయితే - ఎక్కడెక్కడి కవులు మా ఊరు చేరు కుంటున్నారుగదా - మరి నువ్వెప్పుడూ, మా ఊరు రాలేదేం సామీ.

రామలింగ :- మీ ఊరేదో నువ్వు చెపితే గదా నేను సమాధానం చెప్పగలిగేది

రంగశాయి :- " కవి" అంటే - యిక సెవుతాలే సామీ - మాది ఇజయనగరం

రామలింగ :- ఆఁ - విజయనగరమా - నేను విజయనగరానికే బయలు దేరాను.

మా దేవయ్య శెట్టితో కలిసి. అదే తంటా తెచ్చి పెట్టింది. ఉదయగిరి మీదుగా పోదామన్నాడు. సరే అన్నాను. కాని ఈ ఊరు చేరిన మర్నాడే రాయలవారి సేనలు ఉదయగిరిని ముట్టడించాయి. ఇక్కడ ఈ కోటలో చిక్కుకుపోయాను.

రంగశాయి :- మంచిదే అయింది సామీ ! ఆడబోయిన తీర్థం ఎదురైంది.

రామలింగ :- ఏమి తీర్థమో ఏమో ! ప్రజలందరూ యీ యుద్ధం గొడవలో ఉన్నారు. ఆతిథ్యం కరువైపోయింది తీర్థప్రసాదాలు కృష్ణాలయంలో కూడా లభించడం లేదు. ఆబోతులు పోట్లాడుకుంటే - మధ్య లేగ దూడల కొచ్చి పడింది - చావు.

రంగశాయి :- భయపడకయ్యా మహానుభావా! రాయలోరుగానీ ఆరితాలూకు సైన్యంగాని - కవుల నేం చేయ్యరులే - అయినా యింకెంత సేవు - ఇప్పడో యింకో ఘడియకో యీ కోటలో రాయలోరు ప్రవేశిస్తున్నారు. యీలోపుగా ఒక మంచి పద్యం ఆలోచించుకొని సిద్ధంగా ఉండు.

రామలింగ :- రాయలవారి దర్శన భాగ్యం కలగాలే గాని - ఆలోచించకుండా ఆశు ధారగా ఘడియకు అరవై పద్యాలు చెప్పగలను.

రంగశాయి :- అబ్బ నా సామిరంగ-గడియకు అరవై పద్యాలా ? నమ్మమంటావా - లేక పోతే మీ శ్రీనాథుడు చెప్పినట్లు "కొండవీటిలో - గాడిద నీవునుం కవివి గాదు గదా అనుమాన మయ్యెడిన్ " అని ......

రామలింగ :- ఇందాకట్నుంచీ చూస్తున్నాను. ఎవడ్రా నువ్వు - నోటికి వచ్చినట్టు పేలుతున్నావు - నిషాలో ఉన్నవా యేమిటి ?

రంగశాయి :- ఎంత కోపం - ఎంత కోపం - మరి నే నెవడ్నో చెపుతాను ఇనుకో - అంత దిగిపోద్ది - " మేము శ్రీ శ్రీ మూరు రాయరగండ ఈరప్రతాప క్రిష్ణరాయల్వారి యింజామర యీచే రంగశాయి గార్లం " ? తెలిసిందా ?

రామలింగ :- మరి చెప్పావు గాదే - నాయనా రంగశాయీ నీవు నిజంగా రాయలవారి ఆంతరింగిక భృత్యగణంలో వాడివా ? అదే వారికి వింజామర వీచె వాడివా ? నాకు నమ్మకం కలగడం లేదు.

రంగశాయి :- ఎందుకు నమ్మవూ అంట ! సచ్చప్పెమాణీకంగా నేనన్నది. నిజం. అయినా యింకో గడియలో నువ్వే చూస్తావుగా.

రామలింగ :- నీవే నిజంగా రాయలోరికి వింజామర వీచే రంగశాయి వైతే కవులను ఇలా దూషిస్తావా?

రంగశాయి :- సామీ - దూసించడంగాదు సామీ. యిదంతా ఒక ...... దాని పేరేమిటి?

అవును ...... చలోక్తులు ...... చలోక్తులు సామీ, యియ్యన్నీ ఇంకా నీకు నమ్మకం గలక్కపోతే ఒక సమస్య

యిస్తాను. దాన్ని పూరించు అప్పుడు దెలుస్తుంది.

రామలింగ :- నీవు ......- సమస్య యిస్తావా ?

రంగశాయి :- ఆ యిస్తా మా రాయలోరి సభలో అన్నీ అయ్యేగా - అదిసరేగానీ, సమస్య యిస్తే ? మరిదాన్ని నువ్వు పూరిస్తావా ?

రామలింగ :- చిటికెలో

రంగశాయి :- అయితే యిను - " కుంజర యూధంబు దోమ కుత్తుక సోచ్చెన్" నా సామిరంగ, పూరించు - సామీ.

రామలింగ :- ఓరి అసాధ్యుడా - ఎక్కడిదిరా నీ కీ సమస్య ?

రంగశాయి :- పూరిస్తాను - ఇందాక నీవే మన్నావు - యిష్టాగోష్టి యివి చలోక్తులు అని - అంతేనా,

రంగశాయి :- అంతే - సామీ.

రామలింగ :- ఇందాకనుండి కవులను దూషించావు గదా...

రంగశాయి :- మళ్లీ అదేమాట - చెప్పా గదా సామీ.

రామలింగ :- నేను కూడా యింతకు ముందే సరే నన్నాను గదా. నువ్వంటే నువ్వు గావు - ఇంకెవరైనా కవులను దూషించేవాళ్లు గనుక ఈ సమస్య యిస్తే వాళ్లకు బుద్ధి చెప్పేవి ధంగా దీన్ని ఎలా పూరిస్తావో అలా పూరిస్తాను. మరి నీవేమీ అనుకోగూడదు. రంగశాయి :- సరే సామీ - మీయిష్టం వచ్చినట్లు పూరించండి.

రామలింగ :- అయితే విను - గంజాయి త్రావి తురకల

సంజాతుల గూడి కల్లు చవి కొన్నావా ?

లంజాకొడకా ! ఎక్కడి

కుంజర యూధంబు దోమ కుత్తుక జొచ్చెన్ ?

ఎలా ఉంది ?

రంగశాయి : సామీ ! కయిత్వం రాదు గానీ - నేను చెపుతాను యినుకోండి. మరి "ఎలా ఉంది" అన్నారు. గదా.

రామలింగ :- అన్నాను.

రంగశాయి :- ఇందాక నేను జెప్పానే మీ శ్రీనాథుడు కొండవీటి కయిత్వాన్ని గురించి చెప్పిన మాటలు. సరిగ్గా ఆ రకంగా ఉంది.

రామలింగ :- ఓరి పిడుగా !

రంగశాయి : – కయిత్వమంటే మా ఊరొచ్చి యిను సామీ - మా దూర్జటి గారూ మా పెద్దన గారు, తిమ్మన గారు - కవులంటే ఆళ్లే కవులు - ఇజయనగరం వచ్చి గుక్కెడు తుంగభద్ర నీళ్లు తాగు నాసామిరంగ కలం బట్టినా, కత్తిబట్టినా ఆగదంతే.

రామలింగ :- రంగశాయీ - నీ పుణ్యమా మరి ఈ మాటలు నాతో అన్నావు గాబట్టి సరిపోయింది. ఈలాగే వేరే వాళ్లతో ప్రేలుతూ కనిపించావో ఈ ఉదయగిరిలో నీ తల నరికి కపాలతోరణంలో గ్రుచ్చుతారు. జాగ్రత్త.

రంగశాయి : పో అప్పా ! పో - ఎవరి తలలు ఎవరు తోరణంలో గుచ్చుతారో ఒక్కసారి యీ కోటపై నుంచి క్రిందికి చూడు తెలుస్తుంది.

రామలింగ :- నిజమే - నేల యీని నట్లు సైన్యం కోటలోపలికి చొచ్చుకొచ్చేస్తున్నారు.. రంగశాయి :- అందరికీ మధ్య కొట్టొచ్చినట్టు కనబడే ఆ తెల్ల గుఱ్ఱం చూడు సామీ - ఆ గుఱ్ఱం మీద ఉన్న వీరుడు. మా విశ్వనాథ నాయకుడు - యిప్పుడు తెలిసిందా సామీ.

రామలింగ :- శతఘ్నుల ధాటికి కొండలు కూలిపోతున్నాయి. కోటగోడలు పడిపోతున్నాయి. మరొక్కక్షణం యిక్కడ నిలిస్తే ప్రమాదం ముంచుకొచ్చేట్లుంది. వస్తా శాయీ - బ్రతుకుంటే - మళ్ల కలుద్దాం (నిష్క్రమణ)

రంగశాయి :- భయం లేదు సామీ ఎవ్వరైనా నీ కడ్డుపడితే " కవిని " అని ఒక్కమాట చెప్ప చాలు - నీకేమీ అపకారం జరగదు.

(ప్రవేశం - ప్రహరేశ్వరపాత్రుడు - తిరుపతిమల్లు)

తిరుపతి :- ఎవరక్కడ - ఎవరు రా నువ్వు ?

రంగశాయి :- రా - నువ్వెవడురా ఆమాట అడగడానికి ?

ప్రహరేశ్వర :- తిరుపతి మల్లు! వీడెవడో రాయలవారి గూఢచారిలా – కన్పిస్తున్నాడు వీడిని -

రంగశాయి :- నేను గూఢచారిని గాను - శ్రీ శ్రీ శ్రీ మూరురాయరగండ ఈరప్రతాప శ్రీకృష్ణదేవరాయలోరి యింజామర యీచే రంగశాయిని తెలిసిందా.

ప్రహరేశ్వర :- ఎవరికి వింజామర వీచమని నిన్నిక్కడికి పంపించర్రా? మీ రాయలేరు.

రంగశాయి :- ఇది ఏగతాళికి సమయం కాదు. యిశ్వనాథనాయకుడి కంటే నేను ముందుండాలని ఏకాంగి దళం వీరులతో కోటగోడ పైకి పాకి వచ్చాను.

తిరుపతి :- నీవు రాయలవారి మనిషి వని తేలిపోయింది గదా ఇప్పుడు నీ తల నరకి మా కపాల తోరణంలో గ్రుచ్చుతే ఏం చేస్తావు ?

రంగశాయి :- తరువాత నా కపాలం ప్రక్కకు చేరే మీ కపాలాలకు స్వాగతం చెబుతాను.

ప్రహరేశ్వర :- మల్లూ - వీడి గుండె నిబ్బరం చూడు - ఒంటరిగా వచ్చి నోటికి వచ్చినట్లు ప్రేలుతున్నాడు.

రంగశాయి :- ఒంటరిగా వచ్చానా ! ఏ లోకంలో ఉన్నారు సాములూ ? నాతో రెండువేల మంది ఏకాంగిదళం అయిదో ప్రాకారంలోకి దూకారు.. ఈపాటికి ఆరో ప్రాకారాన్ని కూడ వశం చేసుకుని ఏడవ ప్రాకారం చుట్టుముట్టి ఉంటారు.

(ప్రవేశం)

భటుడు :- జయం, జయం పాత్రులవారికి.

ప్రహరేశ్వర :- ఏమిటి విశేషాలు ?

భటుడు :- ప్రభూ ! రాయలవారి సేనలు 5,6 ప్రాకారాలను దాటి 7 వ ప్రాకారంలోకి చొచ్చుకువస్తున్నాయి.

ప్రహరేశ్వర :- మల్లూ - మనం ఇప్పుడు కత్తెర బోనులో ఇరుక్కున్నాం. 4 ప్రకారాలు ఎప్పడో కూలి పోయినాయి. 5,6 ప్రాకారాలు ...

రంగశాయి :- అయిదూ లేదు - ఆరూ లేదు - రాయలోరి ప్రతిజ్ఞ యినండి ఈరోజు ఉదయగిరి దుర్గాధిపతి - పాత్రులోరి తలకాయ నరికీ దాన్ని కాలితో తన్ని గాని మా రాయలోరు స్నానం చేయరు! మెతుకు ముట్టరు.

ప్రహరేశ్వర - ఆహా! ఎంతటి దుర్భర పరిస్థితి తటస్థించింది.

రంగశాయి :- అదిగో యిశ్వనాథ నాయకుడి తెల్లగుఱ్ఱం. యిక చిటికెల్లో రాయలోరు యిక్కడుంటారు.

**తిరుపతి :- ప్రభూ ! మన కోట పట్టుబడి నట్లే, సంధికి రాయబారం పంపడం మంచిదని తోస్తున్నది.**

**ప్రహరేశ్వర :- తప్పదా ? మల్లూ !**

**తిరుపతి :- తప్పదు.**

**ప్రహరేశ్వర:- అయితే రాయబారిగా నీవే పోవలెను సుమా (తెరలో కల కలం) - మల్లూ పో, దుర్గ ద్వారాలు తెరిపించి తెల్ల జండా ఎత్తించు. వెళ్లు (తిరుపతిమల్లు నిష్క్రమణ) - (తెరలో - మూరు రాయరగండ పరగండ బైరవ, రాజప్రతాప, రాజ పరమేశ్వర బహుపరాక్. హత్తిబ్బ గండ, జగనొబ్బగండ, మాట దబ్బర గండ బహుపరాక్. సాహితీ పమరాంగణ సార్వభౌమ, శ్రీశ్రీ కృష్ణరాయ దేవేంద్రా - విజయీ భవ, దిగ్విజయీ భవ.**

**(ప్రవేశం)**

**రాయలు, తిమ్మరుసు, పెద్దన విశ్వనాథవాయకుదు (విశ్వనాథుడు కత్తి పట్టుకుని)**

**ప్రహరేశ్వర :- జయం జయం - సాహితీ సమరాంగణ సార్వభౌములకు ఉదయగిరి దుర్గాధినేత, గజపతి రాజకుమారుడు. ప్రహరేశ్వర పాత్రుడు . శరణాగతుడై ప్రాణభిక్ష కోరుచున్నాడు.**

**రాయలు :- పాత్రులవారు మా ప్రతిజ్ఞ విన్నట్లు లేదు.**

**ప్రహరేశ్వర :- విన్నాను. ఈ రంగశాయి ద్వారా విన్నాను. విని సంధి నిశ్చయించి దుర్గద్వారాలు తెరిపించి తెల్ల జండాఎత్తించి మీ శరణు గోరి యిచ్చటకు వేచియున్నాను. ప్రభువులు ధర్మం చేయవలసిందని వినయ వినమ్రితశిరస్కుండనై వేడుకొనుచున్నాను.**

**రాయలు :- అటు మా ప్రతిజ్ఞ - ఇటు శరణాగత రక్షణ ! ఆంధ్రకవితాపితామహా - శరణాగత రక్షణ గురించి మన శాస్త్రములు ఏమని లిఖించినవి.**

**పెద్దన :- ప్రభూ ! పంచమవేదమైన భారతంలో**

**శరణంబని వచ్చిన భీ**

**కర శత్రు నైన బ్రీతి గావగవలయుం**

**గరుణా పరుల తెరంగిది**

ఇరువుగ సరి గావు - దీనికే ధర్మంబుల్ - అని చెప్పండి.

ప్రహరేశ్వర :- కవితా పితామహులు చక్కగా సెలవిచ్చారు. మీకు నా నమస్కృతులు. రాయలు :- ధర్మశాస్త్రం ఈ విధంగా చెప్పగా - రాజనీతి శాస్త్రం ఏమని చెపుతోంది అప్పాజీ.

తిమ్మరుసు :- ప్రతిజ్ఞా పరిపాలన - శరణాగత త్రాణన - రెండూ గొప్పవేనని

చెప్పతోంది. ప్రభూ!

రాయలు :- అయితే తుది నిర్ణయం మీదే.

తిమ్మరుసు :- - ప్రహరేశ్వరపాత్రులు శరణాగతులు.

ప్రహరేశ్వర :- అవును మహామంత్రీ - త్రికరణ శుద్ధిగా నేను శరణాగతుడను.

తిమ్మరుసు :- ఆ విధంగానే భావిలో గూడా .....

ప్రహరేశ్వర:- కృతఘ్నత వలన ఇహం, పరం, రెండూ చెడిపోతాయి గదా !

తిమ్మరుసు :– ప్రతిజ్ఞాపాలన ప్రభువులకు ప్రథమ కర్తవ్యము.

రాయలు : మరి శరణాగత రక్షణ ?

రాయలు :- ఉభయతారకమైన ఉపాయం ఒకటున్నది. పాత్రుల వారు రాయల వారి పాద పీఠికకై తమ కిరీటం సమర్పించవలెను, కిరీటం శిరస్సుతో సమానం గనుక ప్రభువుల, కిరీట తాడనంతో తమ పతిజ్ఞా నిర్వహించ వచ్చు మరి పాత్రుల వారు ....

ప్రహరేశ్వర :- సంతోషంగా సమర్పించు కుంటాను. కాని ప్రభువులు మన్నిస్తే నాదొక చిన్నమనవి. ప్రభువుల ప్రతిజ్ఞా పాలన నిండు సభలో గాకుండా ప్రభువుల ఏకాంత సమావేశంలో నిర్వహించాలని సవినయంగా ...

రాయలు :- పాత్రులవారి కోరికను మేము మన్నిస్తున్నాము.

ప్రహరేశ్వర :- ప్రభూ సర్వాదా మీకు కృతజ్ఞుడను - ఇదిగో నా కిరీటం సమర్పించుకుంటున్నాను.

రాయలు :- (నామ మాత్రంగా పాదం కిరీటానికి తగిలించి - కిరీటాన్ని పాత్రుడికి స్వయంగా ధరింపజేసి) పాత్రులవారిక నిర్భీతులై ఉండ గలరు.

**తిమ్మరుసు :- ఉదయగిరీశ్వరులకు - ప్రభువులకు, కానుకలు, కప్పం సమర్పించ వలెను. ప్రభువులు యిక్కడ కొలువు - దీర్చి కొంత తడవు విశ్రాంతి తీసుకుంటారు. పాత్రులవారు .......**

**ప్రహరేశ్వర :- అన్ని ఏర్పాట్లు నేను స్వయంగా చూచుకోగలనని విన్నవించు కుంటున్నాను.**

**తిమ్మరుసు :- మంచిది.**

## ద్వితీయాంకం - (ద్వితీయ రంగం)

**రాయలవారి కొలువు**

**భటుదు :- తెనాలి రామలింగ కవీశ్వరుడట - దేవర దర్శనార్థం వేచియున్నారు.**

**రాయలు :- సంతోషము వెంటనే ప్రవేశ పెట్టు.**

**భటుదు :- చిత్తం**

**(రంగశాయి- రాయల వారి సంభాషణ)**

**రామలింగ :- జయం జయం సాహితీ సమరాంగణ సార్వభౌములకు, ఇటు సాహిత్యరంగం, అటు సమరాంగణం ఈ ఉభయరంగములలో ప్రభువులు అద్వితీయులు సుప్రసిద్ధులు. ముందుగా సమరాంగణంలో తమ ప్రతాపాన్ని వర్ణిస్తూ యీ పద్యాన్ని కానుకగా సమర్పించుకుంటున్నాను.**

**" కలనన్ తావక ఖడ్గ ఖండిత రిపుక్ష్మాభర్త మార్తాండ మం**

**దల భేదం బొనరింబి యేగునెడతన్మధ్యంబునన్ హార కుం**

**డల కేయూర కిరీట భూషణని శ్రీనారాయణుం గాంచి లో**

**గలగం బారుచు నేగే నీవ యను శంకన్ - - కృష్ణ రాయాధిపా"**

**ఇక సాహిత్య రంగంలో తమ విశిష్టతను గురించి యీ పద్యం చిత్తగించండి**

**ఎందరు రాజు లీ పుడమి నేలిరో, యింతకు ముంద రందరున్**

**మ్రందిరి చీకటిన్ సుకవిమందలి వాఙ్మయమందిరమ్ములన్**

**కుంద వధూ పుటీ తుహిన కోమల కీర్తి - సదా చరిత్రలో**

**నుందువు సాహితీ ప్రియ, మహోదయ, నీవె, నృసింహ నందనా"**

పెద్దన :- శెభాష్ రామలింగకవీ - శెభాష్.

రాయలు :- రామలింగ కవీంద్రా - ఉత్తమ లక్షణ సమన్వితమైన నీకవిత్వంతో మాకు అనిర్వచనీయానందం కల్పించావు. నీకు మా స్వాగతం ఆశీనుడువు కమ్ము.

రామలింగ :- ధన్యోస్మి ప్రభు ! ధన్యోస్మి.

రాయలు :- నీ ఆగమనానికి ముందే, పండిత పామరజనానంద కరమైన నీ కవితారీతిని గురించి చూచాయగా మా రంగశాయి ద్వారా, విని యున్నాము. నీకొక సమస్య నివ్వదలిచాము. నీవది హృద్యంగా పూరించి మా అందిరికి ఆనందం చేకూర్చ వలె. రామలింగ :- మహాప్రసాదం.

రాయలు :- సమస్య ఇది " కుంజర యూధంబు దోమ కుత్తుక జొచ్చెన్"

తిమ్మరుసు :- పూరించండి - కవి గారు .

రామలింగం :- ప్రభూ - అవధరించ వేడికోలు.

"రంజన చెడి పాండవు లరి

భంజనులై - విరటు కొల్వ పాల్పడి రకటా !

సంజయ ! విధి ? నే మందును ?

కుంజరయూధంబు దోమ కుత్తుక జొచ్చెన్"

రాయలు :- సెహభాష్! సెహభాష్ !

తిమ్మరుసు :- ఈ కవి వయస్సులో పిన్న - కవిత్వంలో పెద్ద.

పెద్దన :- చాలా సంతోషం నాయనా, మహాభారత కవితకు దీటుగా ఉండదగిన చక్కని పద్యం చెప్పావు.

రామలింగం :- అల్లసాని వారికి తెలుగు నేల నాలుగు చెఱగులా ఉన్న అనేక ఏకలవ్య శిష్యులలో నేను ఒకడిని - సవినయంగా మనవి చేస్తున్నాను.

రాయలు :- ఆంధ్ర కవితా పితామహులను మెప్పించిన కవికుమారుడు. పూర్వ దిగ్విజయయాత్రకు ముందే మనకు లభించడం. రామలింగకవి అష్టదిగ్గజాలలో ఒకడై మా భువనవిజయము నలంకరించు గాక! రామలింగకవి కవితాపితామహుల ప్రక్కన పీఠాన్ని గ్రహించండి.

**రామలింగ :- సార్వభౌమా ! అపారమై, సాంద్రతరమై పొంగులు వారి ప్రవహించిన మీ కృపారసము నన్ను సంపూర్ణముగా నాప్లావితము జేసినది. ధన్యోస్మి మీకు సర్వదా కృతజ్ఞుడను.**

**"సరసుండై నను మెచ్చి ఇచ్చి నిపుడీ సాహిత్య సమ్రాట్టు కుం**

**జర పీఠంబును నేడు ఆంధ్ర కవితాచార్యుండు పెద్దన్న తో**

**సరసన్ కూర్చొనుచుంటి నే భయముతో - క్షంతవ్యుండన్ మూరు రా**

**యర గండా ! పరగండ భైరవ, విశాలాంధ్రక్షమాధీశ్వరా".**

**పెద్దన :- సకల సన్మంగళాని భవంతు.**

**తిమ్మరుసు :- ప్రభూ నాగమనీడు దగ్గర నుండి ఒక లేఖ వచ్చినది.**

**రాయలు :- వినిపించండి.**

**తిమ్మరుసు :- మహారాజశ్రీ కృష్ణదేవ రాయ రాజపరమేశ్వరులకు నాగమ నీడు విజ్ఞాపన**

*"పాండ్య చోళ ప్రభువులు ఇరువురూ ప్రజాకంటకులే ఆ అసమర్థులను ఇద్దర్నీ పదవీచ్యుతులను గావించి ఆరాజ్యాలను రాయలవారి సామ్రాజ్యంలో కలిపి వేసినాను. రాయలవారి శ్రేయస్సు - ప్రజాశ్రేయస్సు - విజయనగర సామ్రాజ్య శ్రేయస్సు దృష్ట్యా యిలా చేయవలసి వచ్చినది. భవిత్యం ప్రభువుల సూచనమేరకు నిర్వహిస్తాను. తమ ఆజ్ఞ కోసం ఎదురుచూస్తున్నాను."*

**ఇట్లు**

**విధేయుడు - నాగమనీడు**

**రాయలు :- అవిధేయుడు - నాగమనీడు అంటే బాగుండేది.**

**తిమ్మరుసు :- నమ్మిన బంటు నాగమనీడు, రాజాజ్ఞ మీరువాడు గాదే రాయల వారికి మేలు చేస్తాననే అపోహతోనే యిలా చేసియుంటాడనడంలో సందేహం లేదు.**

**రాయలు :- కానీ ఆరాజ్యాలను కలుపుకోవాలెనని కలలో కూడా మేము అనుకోలేదే ! అప్పాజీ యిది రాజాజ్ఞ ధిక్కారం కాదా.**

**తిమ్మరుసు :- నేరమే ! కాదని ఎవ్వరనగలరు.**

**రాయలు :- రాజాజ్ఞ మీరిన నాగమనీడు జీవద్ గ్రహంగా బంధించి మా ఎదుట నిలబెట్టవలెనని మా ఆజ్ఞ.**

**తిమ్మరుసు :- ఆ మహావీరుని బంధించి తెచ్చే శౌర్యసాహసాలు కలవారెవ్వరో తమరే నిశ్చయించి, యీ కార్యమునకు...**

**విశ్వనాథ :- ప్రభూ - ఆమ ఆజ్ఞ అయితే - నేను పోయి మా తండ్రి - కాదు - దళవాయి నాగమనీడును బంధించి తమ పాదారవింద సన్నిధిని సమర్పించగలను.**

**రాయలు :-శభాష్ వీర శేఖరా ! ఈ గురుతర కార్యాన్ని నిర్వహించగల చేవగల వాడవు నీవే. ఇదిగో, కర్పూరా తాంబూలం - విజయీా భవ - పోయిరా-**

**విశ్వనాథ :- శ్రీకృష్ణదేవరాయ సార్వభౌములకు - జై-జై**

## తృతీయాంకం

**(విజయనగరము - రాయ సభ - తిమ్మరుసు.)**

**పెద్దన - దూర్జటి - ఆశీనులై ఉండగా రాయలవారి ప్రవేశము.**

**వంధిమాగధులు :- జయ జయ స్వస్తిశ్రీ, మహారాజ రాజశ్రీ, రాజ పరమేశ్వర, రాజమార్తాండ, మూరురాయరగండ, పరగండ బైరవ, సాహితీ సమరాంగణ సార్వ భౌమా ! బహు పరాక్.హత్తిబ్బరగండ - జగనొబ్బరగండ - మాట దబ్బరగంతా బహుపరాక్ రాయచూరు - ఉదయగిరి, కొండవీడు కొండపల్లి - కటకపురి చూరకొర బహుపరాక్.**

**సభలో ఉన్నవారు. జయం, జయం, సార్వభౌములకు**

**రాయలు :- అప్పాజీ ! అభివాదములు. ఆంధ్ర కవితాపితామహ దుర్జటి మహా కవీంద్రా - స్వాగతం.**

**విశ్వనాథ :- (ప్రవేశం) జయం జయం సార్వభౌములకు - ప్రభువుల ఆజ్ఞానుసారము - దళవాయి నాగమనీడును జీవద్ గ్రాహంగా బంధించి - తమ పాదారవింద**

**సన్నిధిని సమర్పించుచున్నాను.**

**రాయలు :- భళా! విశ్వనాథనాయకా! భళా ! నీ స్వామిభక్తి-ధీరోదాత్తత ఉదాహరణప్రాయములు తండ్రి అని చూడ కుండా - దళవాయి నాగమనీడును ఓడించి బంధించి తెచ్చి మా సామ్రాజ్యప్రతిష్ఠ కాపాడిన నీకు మా అభినందనలు - నిన్ను ఈ క్షణం నుంచే మధురారాజ్యమునకు రాజ ప్రతినిధి గా నియమించుచున్నాము. ఇదిగో కర్పూర తాంబూలం.**

విశ్వనాథ :– ప్రభువుల అనుగ్రహానికి సర్వదా కృతజ్ఞుడను.

రాయలు :- నాగమ నాయకా - నీవు చెప్పవలసినదేమైనా వుంటే చెప్పకోవచ్చు.

నాగమ :- ప్రభువుల సావధానంగా చిత్తగించాలి - పాండ్య చోళ రాజ్యాలను రాయలవారి ఏలుబడి కిందికి తీసుకుని రావాలని కోరుకున్నానే గాని ఆ రాజ్యాలను నేను ఏలుకోవాలని కోరుకోలేదు. విజయనగర సామ్రాజ్య శ్రేయస్సు, రాయల వారి శ్రేయస్సు అన్ని ధర్మాలకన్నా పరమధర్మాలని నమ్మి నేనీ పని చేశాను ప్రభూ !

రాయలు :- ఆ రాజ్యాలను కలుపుకోవాలని మేము కలలో కూడా అనుకోలేదే! మేము నీకు చెప్పి పంపిన దేమిటి - నీవు చేసిన దేమిటి ?

తిమ్మరుసు: - సత్సంకల్పంతో నైనా - రాజాజ్ఞను అక్షరం పొల్లు పోకుండా పాటించాలనే మర్యాద నీకు తెలియదా నాగమనీడు ?

నాగమ :- నాగమనీడు హృదయం తమ బాకుతో చీల్చి చూడండి ప్రభూ కేంద్రప్రభుత్వం పటిష్టంగా ఉండాలని - ఒకే నాయకుడు - ఒకే ప్రభుత్వం ఒకే పతాకం క్రింద ప్రజలందరూ సుఖంగా ఉండాలని నాలో ప్రవహిస్తున్న ప్రతి రక్తబిందువు కోరుతోంది. నేను ప్రదభ్రష్టులు చేసిన ప్రభువులిద్దరూ ప్రజాకంటకలు. పాండ్య, చోళ ప్రజలకు విజయనగర పతాకచ్ఛాయలో ఉండే శాంతి భద్రతలు అసమర్థులు దుర్జనులు అయిన ఆ ప్రభువుల ఏలు బడిలో లభిస్తాయా ? ప్రభూ.

రాయలు :- ఇది సామ్రాజ్య వాదుల పరిభాష, ఇప్పడది అప్రస్తుతము అసందర్భము - ఆనాడు 'నేను రాయబారి ద్వారా పాండ్యరాజుకు ఇచ్చిన మాట తప్పిపోయిందా లేదా అనేది ప్రశ్న, పై పెచ్చు నమ్మక ద్రోహం చేశామనే అపవాదు మనకీర్తి ప్రతిష్ఠలను మంట కలిపి వేస్తుంది కదా. నా ఆజ్ఞ మీరి యింత అనర్థం తెచ్చి పెట్టిన నిన్ను ఏవిధంగా క్షమించేది ? మా చేతులతో వీరాభిషేకం చేసిన నీకు మా నోటితో శిక్ష విధంచలేము. నాగమనీడ, నీవు చేసిన నేరానికి, నీవే శిక్ష కోరుకో.

నాగమ :- ప్రభూ - ఇదే మీ నిశ్చయమా ?

రాయలు :- ఇది మా ఆజ్ఞ.

నాగమ : - ప్రభూ - అవ్యాజ్యమైన మీ ప్రేమాభిమానాలకు నోచుకోని నేను బ్రతకడం కూడా నిరర్ధకం నాకు

మరణ శిక్ష విధించండి - ప్రభూ.

రాయలు :- నాగమనాయాకా!

తిమ్మరుసు :- ప్రభువులు, మధురాధిపతి - విశ్వనాథనాయకుని స్వామి భక్తికి మెచ్చి కోరినవరం ఇవ్వాలను కున్నారు. ప్రభూ విశ్వనాథ నాయకుడు వరం కోరు కోవచ్చా ?

రాయలు :- అవును మరచాను. విశ్వనాథా ! నీ యిష్టం వచ్చిన వరం కోరుకో

తిమ్మరుసు :- కోరుకో - విశ్వనాథా - సంకోచించకు.

విశ్వనాథ :- కరుణాసాంద్రులైన సార్వభౌములు నన్ను మన్నించి నా పితృదేవుడు నాగమ నాయకుడు కోరిన కోరికను మరణశిక్షను విస్మరించి రద్దుచేయాలని కోరుకుంటున్నాను.

రాయలు :- విశ్వనాథునికి, రాజభక్తి - పితృభక్తి ఉచ్ఛ్వాస నిచ్ఛ్వాసాలనే సత్యాన్ని గుర్తించి విశ్వనాథునికి సంతోషంగా కోరిన వరం ఆ మేరకు నాగమనీడుకు శిక్ష రద్దు చేస్తున్నాము.

అప్పాజీ - మా మనస్సు ఉద్విగ్నమై యున్నది. కోలువు చాలిస్తున్నాను.

(తిమ్మరుసు - రాయలు నిష్క్రమణ)

విశ్వనాథ :- పితృదేవుల చరణారవిందముల పైబడి క్షమాభిక్ష వేడుచున్నాను.

నాగమ :- నాయనా నేను పోగొట్టుకొన్న ప్రభువుల ఆదరాభిమానాలు ఇబ్బడిగా నీకు లభించినందువలన నాకు కొంత కలత తీరినది. మధురాపురాధీశ్వరుడవైన నీకు నా ఆశీస్సులు.

విశ్వనాథ :- రాజభక్తియే గాక రాజ్యభక్తి కూడా నన్నీ కర్తవ్యమునకు పురికొల్పినదని తమరు గ్రహించిన నాకంతే చాలును.

పెద్దన :- నాగమనాయకా మహావీరుడవని నిన్ను ఈ నోటితో కీర్తించాను. ఇప్పడీ సంఘటన నా మనస్సును వికల పరచిందయ్యా .

ధూర్జటి :- ఏమి ? యీ విధి వైపరీత్యము. ఏ రాయలవారు పర గండభైరవ రాయచూరు దుర్గదళవిభాళ మొదలగు బిరుదులతో సత్కరించి ఏ మహావీరునికి గండ పెండేరప్రదానము గావించారో ఆ రాయల వారే ఆ మహావీరుని, రాజధిక్కార నేరస్థునిగా పరిగణించారే హే జగన్నాటక సూత్రధారి ! నీ లీలలు అగమ్యగోచరములు గదా.

"రాజుల్ మత్తులు - వారి సేవ నరకప్రాయంబు వారిచ్చు అం
భోజాక్షి చతురంత యాన తురగీ భూషాదు లాత్మవ్యధా
భీజంబుల్ ! తద పేక్షచా జాలు పరితృప్తిం జెందితిన్ జ్ఞాన లక్ష్మీ
జాగ్రత్ పరిణామమిమ్ము దయతో ! శ్రీ కాళహస్తీశ్వరా"

నాగమ :- మహాకవీంద్రులరా ఈతరుణంలో మీయీ ఆదరాభిమానాలు వడపడ్డ వానికి తరుచ్ఛాయ వలె సంప్రాప్తించినవి. మీకు నా నమస్కారములు - సెలవు.

-: తెర :-

# చతుర్థాంకం

(అష్టదిగ్గజాలతో - రాయలవారి కొలువు)

తిమ్మరుసు :- జయం జయం సార్వభౌములకు కటకం నుండి - కన్యాకుమారి వరకూ ఎత్తిన కత్తి దింపకుండా ద్విగ్విజయయాత్ర కొనసాగించి ప్రజలను కన్నబిడ్డలవలె పరిపాలించుచున్న శ్రీ కృష్ణ దేవరాయల వారు నేటి ఉగాదిని వసంతోత్సవంగా ప్రకటించారని తెల్పడానికి సంతోషిస్తున్నాను.

రాయలు :- పూర్వ దిగ్విజయయాత్ర పూర్తి కాగానే " భువనవిజయం " పేరుతో సభాభవనాన్ని నిర్మించి అందు " అష్ట దిగ్గజాలను " మహాకవులను ప్రతిష్టించాలని మా చిరకాల వాంఛ.

ఒక చక్రవర్తి కొలువు కూటంలో ఒకరిద్దరు మహాకవులుండడం ఒక విశేషం అట్టితరి మన భువన విజయంలో, సాహిత్య స్వయంభువులు అష్ట దిగ్గజాలు ఉండడం కేవలం మా అదృష్టంగా భావిస్తున్నాను. అందుకే యీ వసంతోత్సవం ఆరంభించండి. అల్లసాని వారి అల్లిక జిగిబిగి దూర్జటి కవీంద్రుని పలుకుల అతులిత మాధురీ మహిమలు - వికటకవి హాస్యరస విశ్వరూప సందర్శనం - ముక్కు తిమ్మనార్యుని ముద్దుపలుకు........

తిమ్మరుసు :- మధ్యలో అడ్డు దగిలినందుకు ప్రభువులు మన్నించాలి. " ముద్దు పలుకు" అంటే అర్థం కావడం లేదు.

రాయలు :- మంచి సందేహమే! ముద్దును నిర్వచించిన వారికీ ముత్యాలహారము తిమ్మరుసు :- శృంగార

రసాంబుధిలో దిగితే ప్రబంధ కవులిక బయటకు రారు. ముద్దును మూడు ముక్కల్లో ముచ్చటగా నిర్వచించవలెనని ప్రభువుల అనుమతితో నేను కోరుచున్నాను.

రామలింగం :- వ్యాకరణ సూత్రంలా ఉండాలి.

తిమ్మరుసు :- అల్పాక్షరముల నల్పార్థ రచన కావాలి.

రాయలు :- ఏం రామకృష్ణ కవి!

రామలింగం :- రుచి తెలిసిన పెద్ద లున్నారు - ధూర్జటి గారు.

ధూర్జటి :- పెద్దలు పెద్దన్న గారు గదా.

భువన విజయం

రామలింగం :- అవునండోయ్ - బలవంతంగా ప్రవరుని పై బడి ముద్దు పెట్టుకున్న వరూధినీ హృదయ మర్మవిదులు.

అందరూ :- లేవాలి లేవాలి

పెద్దన :- అందరూ కలిసి నాపై వసంతం జల్లుతున్నారు. కానివ్వండి...

“ ముద్దు” నిఘంటువులో నామవాచకం - నిత్యజీవితంలో క్రియ, వ్యాకరణంలో వ్యస్తపదం. వ్యవహారంలో సమాసం ! నిఘంటువులో ఏకవచనం. నిత్య జీవితంలో బహువచనం. శైశవంలో చేదు చేదు యెవ్వనారంభంలో వగరు - నిండు వయస్సులో మధురం ( రాయలవారు ముత్యాల హారం పెద్దన మెడలో వేస్తారు) .

రామలింగం :- ఆ నోటితోనే సందేహం వెలిబుచ్చిన మహామంత్రి - అంటే నిర్వచనం చెప్పండి.

తిమ్మరుసు :- రామకృష్ణ కవి నామీద వసంతం పోస్తున్నాడు.

రాయలు :- ఇది వసంతోత్సవం కదా - కానివ్వండి.

పెద్దన :- మంత్రి - " దేశ క్షేమం కోసం అబద్ధాలాడడం అభిమాన వృత్తిగా స్వీకరించిన సత్య సంధ్యుడు అభిప్రాయాలను దాచుకునేందుకు మాటలను చతురంగా వాడుకోగల మంచి వక్త - నోటితో పోగుడుతూ నొసటితో వెక్కిరించగల మర్మజ్ఞుడు ఇందుకు అపవాదం శ్రీతిమ్మరుసు మహామంత్రి.

ధూర్జటి :- పెద్దలు - పెద్దన గారేమి చెప్పినా రక్తి కడుతుంది. నాదోక ప్రశ్న రాయల వారు - రాజు; తిమ్మరుసులవారు - మంత్రి - పెద్దనగారు - ఆస్థాన కవి - విశ్వనాధ నాయకుడు - సేనాపతి - నలుగురి వ్యక్తిత్వంలోగల వైవిధ్యం తెలుసుకోవాలని ఉంది.

పెద్దన :- ఆ నలుగురి లో ఒకడ్ని గనుక నేను మాట్లాడ గూడదు.

రాయలు :- నిజమే ! మంచి ప్రశ్న లేసినందుకు దూర్జటి కవీంద్రులకు మా అభినందనలు - సముచిత సమాధానం చెప్పిన వారికీ ముత్యాలహారం.

దూర్జటి :- రామకృష్ణ కవీ - ప్రయత్నించిచూడు - ముత్యాలహారం దక్కించుకో.

రామలింగం :- రాయలవారు క్షమించినా మిగిలిన ముగ్గురూ - అమ్మో, నేను చెప్పను. ఒక్కసారిగా నా పై నలుగురు వసంతం కురిపిస్తే అందులో నేను మునిగి పోతాను. నావల్ల కాదు. ఇంకెవరైనా ప్రయత్నించండి.

మిగిలిన వారందరు :- మేం మునగడం మాకు మాత్రం ఇష్టమా !

రాయలు :- సమాధానం రాకుండా సందేహం నిల్చిపోవడం మన సభా మర్యాద కానే కాదు - ధూర్జటి వారే సెలవివ్వాలి.

ధూర్జటి :- నాకు తెలియకనే గదా అడిగింది.

రంగశాయి :- ఏలినవారు మన్నించి, చిత్తగిస్తానంటే నేను చెపుతాను. దేవరా! రాయలు :- శాయీ నీకు కూడా భవ్య కవితావేశం కలిగిందన్నమాట. ఈ వసంతోత్సవంలో అందరూ పాల్గొనవచ్చు. ఏదీ చెప్ప చూద్దాం.

రంగశాయి :

> రాయలోరు - చెప్పి - తర్వాత చేసి చూపిత్తారు -
>
> తిమ్మరుసయ్య - చేత్తారు - చెప్పనే చెప్పరు.
>
> పెద్దన కవి గోరు - చెపుతారు గానీ చెయ్యరు.
>
> ఇక ఈ శ్రీ విశ్వనాథయ్య - చెప్పడం - చేయడంఒకేసారి చేసేత్తారు.

రాయలు :- భేష్ ! ఇదిగో ఈ ముత్యాల హారం

రంగశాయి :- ప్రభువులు సల్ల గుండాల - దేవరా తమరు కోపపడనని మాటిస్తే నా సందేహం కూడా ఒకటి

మనవి జేసుకుంటాను.

రాయలు :- వసంతోత్సవం మంచి రక్తి కడుతోంది. రంగశాయీ - ఏమిటి నీ సందేహం - అడుగు - భయం లేదు.

రంగశాయి :- "యికట కవి" అంటే ఏమిటో నాకర్థంగాకుండా ఉంది. అదే నా సందేహం.

రామలింగం :- రంగ, రంగా శ్రీ పాండు రంగా, యింతమందినుంచి తప్పించుకొని ఆఖరుకు నీ చేతిలో దొరికి పోయానురా రంగశాయి

ముక్కుతిమ్మన :- ప్రభువుల అనుమతితో రంగశాయి సందేహన్ని అతి క్లుప్తమైన నిర్వచనముతో తీర్చడానికి ప్రయత్నిస్తాను.

రాయలు :- అసలిదంతా మీ "ముద్దు పలుకు" నుంచే వచ్చింది. మీరు ఇంత వరకూ పలుకలేదేమా అనుకుంటుంటే మీరే అడిగారు కానివ్వండి.

ముక్కుతిమ్మన :- రంగశాయి " వికట కవి" అనే ఒక చిన్నమాటను కుడినుంచి ఎడమకు చదివినా ఎడమనుంచి కుడికి చదివినా ఏమార్పు లేకుండా అలా ఉంటుంది అటు చూచినా ఇటుచూచినా ఎటుచూచినా పెరగదు తరగదు యింతంటే యింతే,

రంగశాయి :- అర్థమైంది సామీ అర్థమైంది అచ్చం గొర్రెతోక లాగాన్నమాట మాబాగా చెప్పారు.

రాయలు :- అందరూ సందేహాలు అడుగుతుంటే నాకూ ఒక సందేహం తీర్చుకోవాలనిపించింది. రామాయణం గొప్పదా? భారతం గొప్పదా అని నా సందేహం. రామకృష్ణ :- ఏమున్నది. రామాయణం గొప్పదని రామాయణ పండితులు పొగడియున్నారు. భారతం గొప్పదని భారత పండితులు ఉపన్యసించి యున్నారు. మరి తమరేమో వారికి వీరికి అందరికి జాంబూనదాంబరాదులతో సత్కారములు జరిపియున్నారు.

రాయలు :- రెండు కావ్యాల్లోనూ సౌభ్రాత్రం, గురించి చెప్పబడింది. సౌభ్రాత్రంలో - పాండవులు గొప్పవారా, రాఘవులా ? అది నా సందేహం

దూర్జటి :- ప్రభువులే ఈ విషయం తేల్చవలయును.

రాయలు :- అడిగినది నేను గదా - పండితులు మీరందరూ చెప్పవలె. పెద్దన : – మేమందరం ఇది వరకే

ఎన్నో చెప్పియున్నాము. ప్రభువుల వారి అభిప్రాయం వినవలెనని సభలో అందరూ కుతూహలంతో ఉన్నారు.

రాయలు :- ఆలోచింపగా నాఅభిప్రాయంలో పంచపాండవులె మిన్న అనిపిస్తుంది. రంగశాయి : దేవర వారు రూపాంతరం లో ఉన్నా పాండవుల మీద పక్షపాతం మాత్రం పోనివ్వలేదు.

రాయలు :- రంగశాయి ఎంత చక్కగా చెప్పావోయ్. నేను నా అభిప్రాయం చెబుతూనే యింకో పక్క - ఆదికావ్యానికి అపచారం చేస్తున్నానేమో అని సంశయంతో బాధ పడుతుంటే. నా పేరులో శ్రీకృష్ణ శబ్దం ఉండడాన్ని ఆధారం చేసుకుని నా సముచిత పక్షపాతంగా పేర్కొన్నావు. ఈ భువన విజయంలో ఈనాడు ఆది కావ్యానికి ఆపచారం జరగలేదని నేను అనుకునేట్లు చేశావు. చాలా సంతోషం.

రామలింగం :- జితోస్మి - రంగశాయి జితోస్మి - నీవు నన్ను మించిన వాడవు

అనడంలో నాకు సందేహం లేదు.

రాయలు :- రంగశాయి మా సంతోషం కొద్ది నీవు కోరిన వరం ఇవ్వాలని నిశ్చయించాం

- కోరుకో.

రంగశాయి :- కోరుకోనా - దేవరా

తిమ్మరుసు :- కోరుకో - నీ యిష్టం వచ్చిన కోరిక - కోరుకో..

రంగశాయి :- దేవర కోట మీద పెత్తనం చేసే పదవి కావాలని కోరిక.

రామలింగం :- మొత్తం కోట మీద అధికారం - అంటే రాజధానికి దళవాయి. యింత అధికారం వీడికిస్తే ఇంకేమైనా ఉందా ? అప్పాజీ యీ సమస్యకు పరిష్కారం మీరే కని పెట్టాలి.

తిమ్మరుసు :- రంగశాయి ! రాయలవారు నీ కోరిక అనుగ్రహించారు. నీవు కోరింది. " దేవర కోట మీది పెత్తనం చేసే పదవి" అని గదా.

రంగశాయి :- అవును మహామంత్రి అదే నేను కోరుకుంది.

తిమ్మరుసు :- అయితే విను. మొన్న కృష్ణా తీరంలో ప్రభువులు కొత్తగా నిర్మించిన కోటకు " దేవర కోట" అని నామకరణం చేసి నీ కోరిక ప్రకారము ఆ దేవరకోటకు నిన్ను దళవాయిగా నియమిస్తున్నారు.

రాయలు :- ఈ క్షణం నుండి రంగశాయి దేవరకోట దళవాయి. అప్పాజీ మా శాసనం వెంటనే అమలు పర్చండి. దేవరకోట దళవాయి రంగశాయికి మా అభినందనలు వెంటనే బయలుదేరు.

రంగశాయి :- జయం జయం మహారాజులకు ! - సెలవు.

రాయలు :- అప్పాజీ శక్తియుక్తుల మీద మాకెప్పుడు నమ్మకమే.

రామలింగం :- మొత్తం మీద ఈ వసంతోత్సవం గొప్ప శుభమూహుర్తంలోనే ప్రారంభింపబడినట్లు కనుపించుతోంది. "అగస్త్యభ్రాత"కే యింత ఘన సన్మానం జరిగితే ఇక సాక్షాత్తు అగస్త్యులే అనదగిన మహామహుల్ని ఏ అదృష్టం వరించనున్నదో గదా.

ముక్కు తిమ్మన :- ఋషులకేమి కావలెనయ్యా ఇంత బూడిద, దండ కమండలులు అంతే గదా.

రామలింగం :- . ఇక్కడ అవి కూడా దొరకవండోయ్ తాత గారు. ఆ బూడిద అదే విభూతి, అది మాత్రం ధూర్జటి గారింట్లో దొరుక వచ్చు, పోతే, దధ్యోదనం, చెక్కర పొంగలి మాత్రం విస్తారం, కావాలంటే చెప్పండి పంపిస్తాం.

ముక్కు తిమ్మన :- అది కూడా మా యింట్లో దొరకదులే మనదంతా కొండవీడు గర్తపురీ సంప్రదాయం గదా. గొడ్డు కారం తప్ప - మిగతావన్ని నామమాత్రమే.

రామలింగం :- తాతయ్య ! షడ్రుచుల్లో ముఖ్యమైనవాటిలో కారం గూడా ఒకటనేది తమరు గుర్తించుకోవాలి.

రాయలు :- ఇక వసంతాలు చల్లు కోవడం ఆపి - కవితాగోష్ఠి లోకి వద్దాం. కారం ముఖ్య రుచుల్లో ఒకటని అంటుంటే స్ఫురించింది. కారం మీద ఒక సమస్య యివ్వ దలిచాం. ఈ సమస్య మీ మీ ప్రత్యేక ప్రతిభా వ్యుత్పత్తుల మేరకు అష్టదిగ్గజాలందరూ పూరించాలి. సమస్య ఇది -

" కారమె ముఖ్య హేతువు జగత్తున తీయని హాయి నింపగన్"

పెద్దన :-

కోరి ఝుళం ఝుళత్ కటక గుంఫిత కంకణ కింకిణీ కృతిన్

చేరి - హెూయల్ వగల్ చిలిపి సిగ్గులు లే నును బుగ్గసొట్ట సిం

గారములన్ వేలార్పి నయగారము లోల్కెడి - కావ్య కన్యకా

కారమె ముఖ్య హేతువు - జగంబున తీయని హాయి నింపగన్

ధూర్జటి :-

ఘోర తపస్వభావుడయి క్రూరుడు రావణు డద్రి కన్యకన్

కోరి కరంబు లిర్వదిని గ్రుమ్మిన కొండను కాలివ్రేలితో

పెరిమి నొత్తి - శంకరుదు పీచ్చు మడంచెను గాదె - తచ్చుభా

కారమె ముఖ్య హేతువు - జగంబున తీయని హాయి నింపగన్

పింగళి సూరన :-

ఊరున కెల్ల ఉన్నతమహోన్నత సౌధము నందు రూప సం

స్కారము లొల్కు కాంత - కలకంఠికి కాంతుడు కాంతు చేతి శృం

గార కళప్రపూర్ణమగు కావ్యమలం కృతి కాదె - ఔ నలం

కారమె ముఖ్య హేతువు - జగమ్మున తీయని హాయి నింపగన్

నంది తిమ్మన :-

శ్రీ రమణీ మనోహర విశిష్ట విలాస కళా లసత్ చమత్

కారమె - భారతీ వర పదాంకిత కంకణ కింకిణీ ఝణత్

కారమె - లాస్య సుందర సుఖంకర శంకర శుభా శంకరా

కారమె - హేతువు - జగంబున తీయని హాయి నింపగన్

రామలింగం :-

చారు కవీంద్ర సాంద్రు పరిషత్ పర సేవ్య కథా సుధ రసా

సారమె తత్సమార్జన వశభ్రమరీ, భ్రమరాను లాప, గాం

ధారమె తత్సుసాధపరతత్వ మహా పదవీ తుషాద్యలం

కారమె, ముఖ్య హేతువు - జగంబున తీయని, హాయి నింపగన్

రామభద్ర:

క్రూర విమత్సరోదిత విరోధ పరస్పర పీడ్యమాన రాడ్

ద్వార విమూఢ భావనల వైఖరి మానగ - శాంతి బోధయన్

పేర తథాగతాదులకు భృజ్జన కోటికి నిచ్చు నా వషట్

కారమె ముఖ్య హేతువు - జగంబున దీయని హాయి నింపగన్

మల్లన :

భారతి భాగ్యరేఖ, భగవానుని చిత్ర విచిత్ర సృష్టి శ్రీ

కార సమంచితాంజలి జగజ్జననీ నటనానుభూత మం

జీర ఝుళం ఝుళత్ ధ్వని విశేషము నక్షరమైన ఈశ్వ రోం

కారమె ముఖ్య హేతువు - జగంబున తీయని హాయి నింపగన్.

రామకృష్ణ :-

ఊరక వాదు లేల ? చవులూరు తలంప - రసజ్ఞులార - గుం

టూరు పొలాల పండిన కదుంగడు రుచ్యమునైన పుల్ల గోం

గూరకు నుప్ప పోపు జత గూరిచి ఘాటొనరించుచు సంతరించు ఆ

కారమె ముఖ్య హేతువు - జగంబున తీయని హాయి నింపగన్

రాయలు :- ఆనందం! మహదానందం - చారుతర కవితా గాన మాధుర్యాన్ని సహృదయులైన రసజ్ఞులకు

పంచిన అష్టదిగ్గజ కవీంద్రులు అందరికీ మా అభినందనలు తిమ్మరుసు :- సాహిత్య స్వయంభువులైన అష్టదిగ్గజ కవివరేణ్యుల కొక అపూర్వమైన అవకాశం అద్భుత రసస్పృష్టికి దోహదకారిగా ఆశ్చర్యం లేక పోతే ఆనందాను భూతి పరిణతి చెందదనుకున్నారేమో ప్రభువులవారు ఈ క్షణం వరకూ ఈ సంగతి నాకైనా చెప్పకుండా దాచారు. భువనవిజయ సభా ప్రారంభదినోత్సవాన్ని చరిత్ర పుటల్లో సువర్ణాక్షరాలతో లిఖించే విధంగా చేయాలని వారికీ సంకల్పం కలిగింద నడంలో ఏమాత్రం సందేహం లేదు. ఈనాటి సభాకార్యానుక్రమణికకు మకుటా యమానమగు నీ మహత్తర విశేషాన్ని ఇంతవరకూ వారి మనస్సులోనే పదిలపర్చుకుని వారెంత ఉద్వేగాన్ని భరించి యుంటారో తల్చుకుంటే నాకే ఆశ్చర్యంగా ఉంది.

ఇక వినండి - రసజ్ఞులైన సహృదయు లందర్నీ రసానందముతో ముంచెత్తే విధంగా సంస్కృతాంధ్రాల్లో ఉత్తమ కవిత్వం చెప్పి సభను మెప్పించిన కవిసత్తమున కీశుభదినాన అమూల్య మైన నవరత్నఖచితమై గండ పెండేరాన్ని రాయలవారు తమ స్వహస్తలతో బహుకరింపదలచారు.

అదిగో కళ్లు మిరుమిట్లు గొలిపే ఆ గండపెండేరం, చూడండి. కవి పంచాననులారా ! ! మీకిది జైత్రయాత్ర మీమీ అమోఘ కవితాశక్తులను సమీకరించుకొని తలపడండి - విజయం 'చూరగొనండి లేవండి.

రాయలు:-

ముద్దుగ గండపెండియరమున్ గొనుడంచు బహుకరింపగా

నొద్దిక నాకొసంగుమని ఒక్కరు కోరగ లేదు వేరొకో

పెద్దవ :-

పెద్దన బోలు పండితులు పృధ్విని లేరని నీవెరుంగవే

పెద్దన కీదలంచినను పేరిమి నాకిదు కృష్ణ రాణ్ణృపా !

(చప్పట్లు)

రాయలు :- కవితా పితామహ - సంతోషం - ఉపక్రమించండి.

పెద్దన :- భువన విజయ సభయై నమః .

పూత మెరుంగులున్ పసరు పూప బెదంగులు చూపు నట్టివా

కైతలు ? జగ్గు నిగ్గు నెనగావలె గమ్మున గమ్మనన్ వలెన్

రాతిరియుం బవల్ మరపురాని హోయల్ చెలి ఆరజంపు ని

ద్దా తరి తీపులంబలెను తారసిలన్ వలె - లో దలంచినన్

ప్రాతిగ పై కొనన్ వలెను పైదలి కుత్తుక లోని పల్లటీ

కూత లనన్ వలెన్ - సొగసు కోర్కులు రావలె అలకించినన్ ;

చేతి కొలంది కౌగిటను చేర్చిన - కన్నియ చిన్ని పొన్ని మేల్

మూతల చన్నుదోయి వలె ముచ్చట గావలె పట్టి చూచినన్

దాతోడ  నున్న మిన్నుల మిటారపు ముద్దుల గుమ్మ కమ్మనౌ

వాతెఱ దొండ పండు  వలె వాచవి గావలె పంట నూదినన్

గాతల తమ్మిచూలి దొర కైవసపుంజవరాలి సిబ్బపున్

మే తెలి యబ్బురంపు జిగి నిబ్బర పుబ్బగు గబ్బి గుబ్బ పొం

బూతల నున్నకాయ సరిపోడిమి కిన్నెర మెట్ల బంతి సం

గాతపు సన్న బంతె బయకారపు కన్నడ గౌళ పంతు కా

సొతత తాన తానల పసందివుటా డెడు గోట మీటు బల్

మ్రోతలునుం బలెన్ హరువు మొల్లము గావలె - అచ్చతెన్లు లీ

రీతిగ - సంస్కృతమ్ము పచరించిన పట్టున - భారతీ వధూ

టీ తపనీయ గర్భ నికటీ భవదానన పర్వ సాహితీ

భౌతిక నాటక ప్రకర భారత భారత సమ్మత ప్రభా

పాత సుధా ప్రపూరక బహుభంగ ఘుమంఘుమ ఘుం ఘుమార్బటీ

జాతక తాళ యుగ్మ లయ సంగతి చుంచు విపంచికా మృదం

గాతత తేహి తత్తహిత హాధిత దంధుణు ధాణు దింధిమ

వ్రాత లయానుకూల పదవారకుహూ ద్వహ హారి కింకిణీ

నూతన ఘల్ ఘలాచరణ నూపుర ఝూళ ఝుళీ మరంజ సం
ఘాత వియద్ధుని చక చకద్విక చోత్సల సార సంగ్రహా
యాత కుమార గంధవహ హారి సుగంధ విలాసయుక్తమై
చేతము చల్ల చేయ వలె జిల్లున జల్ల వలెన్ మనోహర
ద్యోతక గోస్తనీ ఫల మధుద్రవ గోఘృత పాయస ప్రసా
రాతి రస ప్రసార రుచిర ప్రసరంబున సారె సారెకున్.

(చప్పట్లు)

రాయలు :- భళా ! కవితా పితామహ ! భళా ఈ రోజు నిజంగా శుభదినం. మాకీ రోజు కలిగిన ఆనందాన్ని మాటలతో గాకుండా చేతలతో నిరూపింపదలిచాం. గండ పెండేరాన్ని మీ పాదాలకు మాచేతులతో అలంకరింప చేయాలి. రండి యిటు రండి.

పెద్దన :- ధన్యోస్మి - ప్రభూ - ధన్యోస్మి మీకు పరమాత్మ సదా ప్రసన్నుడగు గాక –

వ్యాయమస్థిర సంధిబంధ ! కటకాధ్యక్షాను గక్షోణిభృత్
కాయగ్రావ భజదా బిధురదో: ఖడ్గాత్ర ! యుగ్రాచల
జ్యాయః కీర్తిభ ప్రపంచ ! వీర పంచారాయ రామకుణీ
గేయామేయ జయాంక ! పంకజ దృగంగీకార ధీరాకృతీ

అతులక్షాంతిగభీర ! భీరహిత చిత్తాంభోచ, భోజక్షమా
పతివిద్యా పరిపాక ! పాకరపు శుంభర్భోగ ! భోగాశిష
త్రితరస్ఫూర్తీన్యసుఖావ ! భావభరిత శ్రీకాంత ! కాంతారపా
తితకాళింగ మహేశ ! వేశతరవృత్తి క్షీణ వైరివ్రజా.

...... తెర ......